

తెరచుకున్న భీమడోలు రైల్వే గేటు

భీమడోలు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర ట్రాక్ మరమ్మతుల అనంతరం ఆదివారం మధ్యాహ్నం నుంచి భీమడోలు రైల్వేగేటు తెరచుకుంది. తొలుత 3వ తేదీ సాయంత్రం ప్రారంభిస్తామని ప్రకటించిన అధికారులు ఒక రోజు ముందుగానే రైల్వే గేటును తెరిచారు. దీంతో ప్రయాణికులకు ఊరట వచ్చింది. ఈ రైల్వే గేటు తెరచుకోవడంతో జిల్లా నలుమూలల నుంచి ద్వారకా తిరుమల వైపు వెళ్లే వాహనాలన్నీ గేటు ద్వారా వెళ్లవచ్చని అధికారులు సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు : ఎస్పీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా ప్రతి సోమవారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి సుదూర ప్రాంతాల నుంచి అర్జీలు ఇవ్వడానికి ఏలూరు ప్రధాన కార్యాలయానికి రావద్దన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ కార్యక్రమాలకు నో పర్మిషన్

ముదినేపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో ప్రైవేట్ కార్యక్రమాల నిర్వహణ ఇక ముందు అనుమతులు పూర్తిగా బంద్ అయ్యాయి. పాఠశాలల్లో, ఆవరణల్లో ప్రభుత్వ కార్యక్రమాలు, విద్యాపరమైన కార్యక్రమాలు తప్ప ఇతర ప్రైవేట్ కార్యక్రమాలు, సభలు, సమావేశాలు, క్రీడలు నిర్వహించేందుకు వీలు లేదని ఏపీ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాఠశాలల ఆవరణల్లో ప్రభుత్వ కార్యక్రమాలు తప్ప ప్రైవేట్ కార్యక్రమాలకు వినియోగించేందుకు అవకాశం ఉండదని స్పష్టమైంది. ఇప్పటి వరకు పాఠశాలలకు సెలవు దినాల్లో కొంతమంది తమ ప్రైవేట్ కార్యక్రమాలకు వినియోగిస్తుండడం, ప్రైవేట్ వ్యక్తులు ఆవరణలో ఆటలు ప్రాక్టీస్ చేస్తుండడంతో పలు చోట్ల పాఠశాలల హెచ్ఎంలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న ఫిర్యాదులు అందడంతో విద్యాశాఖ కార్యదర్శి పాఠశాలల ఆవరణల్లో ప్రైవేట్ కార్యక్రమాల నిర్వహణపై నిషేధం విధించారు. అయితే సాధారణ ప్రజానీకానికి అక్కడి అవసరాలను బట్టి ఉదయం 4 గంటల నుంచి 7 గంటల వరకు పాఠశాల ఆవరణను ప్రభుత్వ స్పోర్ట్స్ టూరిజం పాలసీ ప్రకారం వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వవచ్చని విద్యాశాఖ కార్యదర్శి పేర్కొన్నారు.

కుర్చీ ఎవరిదో?



నేడు ఏలూరు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్లు..
నూజివీడు మునిసిపాలిటీలో వైస్ చైర్మన్ ఎన్నిక

డిప్యూటీ మేయర్ల ఎంపిక లాంఛనమే

టీడీపీ నుంచి బరిలో వందనాల దుర్గాభవాని శ్రీనివాస్, పప్పు ఉమామహేశ్వరరావు


దుర్గాభవాని శ్రీనివాస్


ఉమామహేశ్వరరావు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు ఏలూరు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ల ఎంపికకు రంగం సిద్ధమైంది. జనవరి 27న రాష్ట్ర ఎన్నికల కమిషన్ మేయర్, డిప్యూటీ మేయర్ల ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఏలూరు నగరపాలక సంస్థలో ఖాళీగా ఉన్న ఇద్దరు డిప్యూటీ మేయర్ల ఎంపికకు మార్గం సుగమం అయ్యింది. ఇప్పటికే ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య(చంటి) కూటమి తరపునుంచి ఇద్దరిని డిప్యూటీ మేయర్లుగా ఎంపిక చేశారు. 43వ డివిజన్ కార్పొరేటర్ వందనాల దుర్గాభవాని శ్రీనివాస్, 37వ డివిజన్ కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. సోమవారం వీరిద్దరూ బీఫారమ్‌లు అందుకుని డిప్యూటీ మేయర్లుగా నామినేషన్లు వేసే అవకాశాలు న్నాయి. గతంలో వైసీపీ కార్పొరేటర్ గుడిదే శ్రీనివాస్, నూకపేయి సుధీర్ బాబులు డిప్యూటీ మేయర్లుగా వ్యవహరించారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వం అధికారంలోకి రాగానే మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబుతో పాటు మెజారిటీ కార్పొరేటర్లంతా కూటమిలో చేరారు. ఈ క్రమంలో డిప్యూటీ మేయర్లు తమ పదవులకు రాజీనామా చేశారు. 2021, జూలైలో నగర పాలక సంస్థలోని 50 డివిజన్లకు ఎన్నికలు జరగ్గా టీడీపీ నుంచి ముగ్గురు, వైసీపీ నుంచి 47 మంది కార్పొరేటర్లు ఎన్నికయ్యారు. గతేడాది సాధారణ ఎన్నికల ముందు వైసీపీకి ఉన్న ప్రజావ్యతిరేకతను దృష్టిలో పెట్టుకుని మరో ముగ్గురు కార్పొరేటర్లు టీడీపీలోకి వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మేయర్‌తో సహా మరో 21 మంది కార్పొరేటర్లు కూటమి ప్రభుత్వంలో చేరారు. దీంతో నగర పాలక సంస్థ పాలక మండలిలో కూటమి కార్పొరేటర్ల సంఖ్య 27కు చేరుకుంది. ఈ క్రమంలో వైసీపీకి చెందిన మాజీ మంత్రి ఆళ్ల నాని రాజకీయాలకు గుడ్‌బై చెప్పడంతో ఆ పార్టీ కార్పొరేటర్లు, కార్యకర్తలు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ఈక్రమంలో మిగిలిన కార్పొరేటర్లంతా కూటమి అభ్యర్థులకు మద్దతు ప్రకటించే అవకాశాలున్నాయి. డిప్యూటీ మేయర్ల ఎన్నిక అనంతరం పాల కమండలి అంతా కూటమి వైపే పూర్తి స్థాయిలో వచ్చే అవకాశాలు న్నాయి.

రసవత్తరంగా..



నూజివీడు వైస్ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు ఎత్తుకు పైఎత్తులు

నూజివీడు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక సోమవారం జరగనున్న క్రమంలో నూజివీడులో రాజకీయం వేడెక్కింది. ఇటు మునిసిపాలిటీలో అధికార వైసీపీ తన పట్టును నిలుపు కునే ప్రయత్నం చేస్తుండగా, అటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం వైస్ చైర్మన్ పదవిని తన ఖాతాలో వేసుకునేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారి నూజివీడులో ఆ పార్టీ మెజార్టీ సాధించడంతో ఇటు పురపాలనను సైతం తన ఖాతాలో వేసుకునేందుకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇటు తాజా మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నూజివీడు పురపాలకంలో తనపట్టును నిలుపుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తూ తన కౌన్సిలర్లను క్యాంప్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో సోమవారం నూజివీడు మునిసిపల్ సమావేశ మందిరంలో జరగనున్న వైస్ చైర్మన్ ఎన్నిక రసవత్తరంగా సాగనుంది.

టీడీపీ పరం కానున్న వైస్‌చైర్మన్ పదవి?

నూజివీడు మునిసిపాలిటీలో వార్డులు 32 ఉండగా తెలుగుదేశానికి ఎనిమిది వార్డుల్లో గెలుపొందగా మిగిలిన 24 వార్డులు వైసీపీ విజయం సాధించింది. అయినా వైస్ చైర్మన్ పదవి టీడీపీ పరం కానున్నట్లు తెలుస్తోంది. వైసీపీకి ఉన్న 24 మంది కౌన్సిలర్లలో పది నుంచి 12 మంది కౌన్సిలర్లు తెలుగుదేశం గూటికి చేరనున్నట్టు సమాచారం. ఇదే జరిగితే వైస్‌చైర్మన్ కుర్చీ తెలుగుదేశంకు సునాయాసంగా దక్కనుంది. తెలంగాణలోని భద్రాచలం వద్ద వైసీపీ క్యాంప్ పెట్టినా శనివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత క్యాంప్ నుంచి ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లను టీడీపీ నాయకులు బయటకు రప్పించి తమతో తీసుకెళ్లినట్టు సమాచారం. ఆదివారం రాత్రి విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద టీడీపీ కౌన్సిలర్లతో పాటు, వైసీపీ నుంచి టీడీపీకి మద్దతు తెలపడానికి వచ్చిన కౌన్సిలర్లతో మంత్రి సారథి ప్రత్యేకంగా సమావేశమై దిశానిర్దేశం చేసినట్టు తెలుస్తోంది.

వైసీపీ కొంప ముంచిన రాజీనామా

ప్రస్తుత వైస్‌చైర్మన్ ఎన్నికకు కారణమైన తాజా మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ రాజీనామా వైసీపీ కొంప ముంచిందని చెప్పవచ్చు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు వైస్ చైర్మన్‌గా ఉన్న సీనియర్ వైసీపీ నాయకుడు పగడాల సత్యనారాయణను ఆ పదవి నుంచి స్థానిక వైసీపీ నాయకత్వం బలవంతంగా తప్పించింది. తన రాజీనామా సమర్పించే క్రమంలో అయిష్టంగానే వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్టు చెప్పినా, నాటి నుంచి పగడాల వైసీపీకి క్రమేణ దూరమవుతూ వచ్చారు. మరోవైపు నూజివీడు మునిసిపల్ పరిధిలో ఎమ్మెల్యే ఎన్నికల్లో సారథికి మెజార్టీ రావడంతో ఇటు వైసీపీ కౌన్సిలర్లు సైతం టీడీపీ వైపు మొగ్గుచూపుతూ వచ్చారు. మరోవైపు నూజివీడు పట్టణ వైసీపీలో నెలకొన్న అనిశ్చితి ఈ పరిస్థితికి మరో కారణం. ఒకవైపు మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్, ప్రస్తుత కోఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణ నేతృత్వంలో, నూజివీడు పట్టణ వైసీపీ అధ్యక్షుడు శీలం రాము ఆధ్వర్యంలో, ఇటు పగడాల సత్యనారాయణ నేతృత్వంలో ఎవరికి వారుగా మూడు గ్రూపులుగా వ్యవహరిస్తుండగా దీనిని సరిచేయాల్సిన వైసీపీ స్థానిక నాయకత్వం స్పందించక పోవడంతో పురపాలకంలో వైసీపీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

వైస్ చైర్మన్ ఎన్నికపై టీడీపీ కసరత్తు

నూజివీడు మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక పై టీడీపీ నాయకత్వం కసరత్తు చేస్తోంది. తాజా మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ పేరుతో పాటు మునిసిపల్ కౌన్సిలర్‌గా ఉన్న మైనార్టీ వర్గానికి చెందిన మహిళతో పాటు ప్రస్తుతం ప్రైవేట్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఓ మహిళా కౌన్సిలర్ పేరు ప్రచారంలో ఉన్నాయి.

నామినేటెడ్ పోస్టులు అత్యధికంగా జనసేనకు వచ్చేలా కృషి చేస్తాం

మంత్రి నాదెండ్ల


మంత్రి మనోహర్‌కు గజమాల వేసి స్వాగతం పలుకుతున్న జనసేన నాయకులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పోస్టుల్లో అత్యధిక పదవులు జన సేనకు వచ్చేలా కృషి చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కార్య కర్తలకు హామీ ఇచ్చారు. మార్చి లో జరిగే జనసేన పార్టీ ప్లీనరీ సమావేశాలు పురస్కరించుకుని ఆదివారం ఏలూరు ఎన్ హోట ల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి నాదెండ్ల పాల్గొని మాట్లాడారు. త్వరలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయనున్న నేపథ్యంలో ఆ పోస్టుల్లో అత్యధికంగా జనసేనకు వచ్చేలా కృషి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. మార్చి 12, 13, 14 తేదీల్లో పిఠాపురంలో జరిగే జనసేన ప్లీనరీ సమావేశాలకు కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయానికి అనుసరించే ప్రణాళికపై చర్చించారు. జనసేన ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, పత్సమట్ల ధర్మరాజు, ఉమ్మడి పశ్చిమ జిల్లా పార్టీ అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, చింతలపూడి ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య, కృష్ణా జిల్లా ఇన్‌చార్జి డి.రామకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులపై చిత్రహింసలు



- తల్లి కళ్లెదుటే బాలుడిని వైర్‌తో బాదిన ప్రియుడు
- జంగారెడ్డిగూడెంలో అమానుషం

7

ఆయుష్‌లో అక్రమాలు

- నకిలీ ధ్రువీకరణ పత్రాలతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి
- 650 రోజులుగా మరో ఉద్యోగి గైర్హాజరు
- ఉన్నతాధికారులకు నివేదిక

చేప ధర పతనం

- భారీగా తగ్గిన తెల్ల చేపల ధర
- నష్టాల ఊబిలో ఆక్వా రైతులు
- ఫంగస్‌దీ అదే దారి

కలిదిండి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : చేపల ధర పతనమైంది. ఇంతకు ముందు తెల్ల చేప కిలో రూ.120 ఉండగా ఒక్కసారిగా రూ.110కి పడిపోవడంతో చేపల పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా నుంచి ప్రతి రోజు సుమారు 400 నుంచి 600 లారీల చేపలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు అయ్యేవి. ప్రస్తుతం తెల్లచేప ధర పతనమవ్వడంతో 200 నుంచి 300 లారీలు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. అస్సోం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో చేపల కొనుగోళ్లు మందకొడిగా జరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేపల మేత డీవోబీ తవుడు 10 టన్నులు రూ.లక్షా 30 వేలు పలుకుతోంది. లీజు ఎకరాకు రూ.లక్ష వరకు ఉంది. ఖర్చు పెరిగి చేపల ధర పడిపోవడంతో రైతులు తల్లడిల్లున్నారు. కాగా ఫంగస్ చేపల సాగు కూడా సంక్షోభంలో పడింది. ఫంగస్ సాగు చేసిన రైతులు భారీగా నష్టపోతున్నారు. ఇంతకు ముందు ఫంగస్ కిలో రూ.100 పలుకగా, ప్రస్తుతం రూ.80కి పడిపోయింది. కిలో ఫంగస్ పెరుగుదలకు రూ.90 ఖర్చు అవుతుందని మేత భారం ఎక్కువైందని కిలో రూ.80కి అమ్మితే తీవ్ర నష్టాల్లో మునిగిపోతాయని రైతులు వాపోతున్నారు. తెల్ల చేపలకు ఫంగస్‌కి గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



గిట్టుబాటు ధర కల్పించాలి

అక్కల వెంకటాచలం, ఆక్వా రైతు



తెల్ల చేప ధర కిలో రూ.120 ఫంగస్ రూ.100 ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మేతల ధరలు తగ్గించాలి. తెల్ల చేపల ఎగుమతులు సక్రమంగా జరగాలి. ఈశాన్య రాష్ట్రాలు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

క్రీనీడలు..

- కలగానే మిగిలిన ఇండోర్ స్టేడియం
- కదలిక లేని క్రీడా ప్రాంగణం, క్రికెట్ స్టేడియం
- క్రీడలకు దూరమవుతున్న నూజివీడు క్రీడాకారులు
- మంత్రి హామీతో ఆశలు సజీవం


అసంపూర్తిగా ఇండోర్ స్టేడియం


క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కేటాయించిన స్థలం

నూజివీడు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడకు వెళ్లినా నూజివీడుకు చెందిన క్రీడాకారులు ఏదో ఒక స్థాయిలో కనిపిస్తూనే ఉంటారు. క్రీడలపై మక్కువతో కళాశాలల్లో క్రీడల్లో పాల్గొని ప్రతిభ చూపి ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పొంది, స్థిరపడిన వారు అనేకమంది ఉన్నారు. అయితే క్రీడా ప్రాంగ ణాల కొరతతో నవతరం క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా నూజివీడులో క్రీడాప్రాంగణాల ఏర్పాటుకు వేసిన శిలాఫలకాలు వెక్కిరిస్తూనే ఉన్నాయి. నిన్న, మొన్నటివరకు అడవులను తలపిస్తూ ముళ్లకంచెలతో దర్శనమిచ్చాయి. గత ఎన్నికలకు ముందు ప్రస్తుత నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి క్రీడాప్రాంగణాల్లో జంగిల్ క్లియరెన్స్ చేయించారు. పట్టణంలో ఎన్ఎస్‌పీ క్వార్టర్స్ వద్ద దివంగత మాజీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి పాలడుగు వెంకట్రావు తలపెట్టిన ఇండోర్ స్టేడియంతో పాటు అన్నవరం రహదారిపై గల క్రికెట్ స్టేడియం, ఆర్డీవో కార్యాలయం వద్ద గల క్రీడాప్రాంగణాలు క్రీడాకారులకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. ప్రైవేట్ కళాశాల ప్రాంగణాల్లో వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులను వినియోగించుకుంటున్నారు.

- మూడు దశాబ్దాలుగా క్రీడాకారులకు ఇండోర్ స్టేడియం కలగానే మిగిలిపోయింది. అప్పట్లో నూజివీడు నుంచి మంత్రిగా ఉన్న పాలడుగు వెంకట్రావు ఇండోర్‌స్టేడియం నిర్మాణానికి ఎన్ఎస్‌పీ క్వార్టర్స్ వద్ద నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయిం చారు. అది ఇప్పటికీ సాకారం కాలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఇండోర్ స్టేడియం నిర్మాణం ప్రారంభమవ్వగా గతంలోని తెలుగుదేశం పార్టీ ప్రభుత్వహయాంలో దాదాపు 50 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా నూజివీడు-అన్నవరం వెళ్లేదారిలో క్రికెట్ స్టేడియానికి శంకుస్థాపన చేశారు. ఈ స్టేడియం తిరిగి వైసీపీ ప్రభుత్వంలో ఎన్నికలకు కొద్దికాలం ముందు మరల శంకుస్థాపన చేసుకుంది. చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి స్టేడియం ఏర్పాటుకు ల్యాండ్ లెవెలింగ్ తదితర కార్యక్రమాలను పూర్తి చేసినా ప్రభుత్వం మారిన తర్వాత ఈ స్టేడియం నిర్మాణం ఒక్క అడుగు ముందుకు పడలేదు. నూజివీడు ఆర్డీవో కార్యాలయం సమీపంలో క్రీడాభివృద్ధికి జమిందారి ఎం.వి.కె.ఎస్ అప్పారావు వంశీయులు దాదాపు ఆరు ఎకరాల భూమిని దానంగా ఇచ్చారు. ఈ భూమిలో క్రీడాప్రాంగణం ఏర్పాటు దశాబ్దాలు గడిచినా ఇప్పటికి సాకారం కాలేదు.

రెండు క్రీడా ప్రాంగణాలను పూర్తి చేస్తాం : మంత్రి

నూజివీడు ఇండోర్ స్టేడియం నిర్మాణంతో పాటు క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్టు గృహ నిర్మాణ పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. క్రీడాప్రాంగణాల అంశమై 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఈ రెండు స్టేడియంల నిర్మాణానికి నిధుల సమీకరణకు చర్యలు చేపడుతున్నామని, అతిత్వరలో క్రీడాప్రాంగణాలను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

ఊపందుకుంటున్న ఉపాధి పనులు

గతేడాది కంటే పెరిగిన రోజువారీ కూలీల శాతం

రోజువారీ సరాసరి వేతనం రూ. 253

జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న పనుల సంఖ్య 700

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. గతంతో పోలిస్తే ఈసారి రోజువారీ కూలీల శాతం గణనీయంగా పెరుగుతోంది. రబీ సాగు జరుగుతున్నా వ్యవసాయ పనుల జోరు తగ్గడంతో కూలీలు ఉపాధి పనుల వైపు మొగ్గు చూపుతున్నారు. మరోవైపు రోజువారీ వేతనాన్ని రూ.300లకు పెంచడం మరో కారణంగా నిలుస్తోంద. వ్యక్తిగత పనుల్లో భాగంగా రైతులు పంట పొలాల్లో పంట సంజీవిని కుంటలు , కందకాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ కందకాలను చెట్టు చుట్టూ, పొలం గట్టు చుట్టూ ఏర్పాటు చేసుకుంటున్నారు. పండ్ల తోటల పెంపకంలో భాగంగా గట్ల వెంబడి మొక్కలు నాటుతు న్నారు. కమ్యూనిటీ పనులలో భాగంగా చెరువులు, పంట బోదెలలో పూడిక తీయడం వంటి పనులను నిర్వహిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 700 వరకు ఉపాధి పనులు నిర్వహిస్తున్నారు. రోజువారీ వేతనం రూ.300 అయినా ప్రస్తుతం జిల్లాలోని ఉపాధి కూలీలకు సరాసరి వేతనం రూ.253 వరకు లభిస్తోంది. సాధారణ ఉపాధి పనులతో పాటు మెటీరియల్ కాంపోనెంట్‌తోను వివిధ రకాల పనులు చేపడుతున్నారు. మెటీరియల్ కాంపోనెంట్ రూ. 67 కోట్లతో వివిధ రకాల రహదారుల పనులను నిర్వహిస్తున్నారు. జిల్లాలో సీసీ రహదారులు, బీటీ రహదారులు, మెటల్ రహదారులు, పుంత రహదారులకు ఉపాధి నిధులు కేటాయించి అభివృద్ధి పరుస్తున్నారు. మెటీరియల్ కాంపోనెంట్‌తో ఈ పనులు నిర్వహిస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో జిల్లాకు సంబంధించి 5.46 లక్షలు జాబ్ కార్డులు ఉండగా 3.48 లక్షల వరకు కూలీలు ఉపాధి పనులను నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఉపాధి కూలీలకు కోటి 40లక్షల వరకు పనిదినాలు కల్పించాలని డ్వామా శాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా ఇప్పటిరకు కోటి 5లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. గతేడాది ఇదే సమయానికి కోటి 2లక్షలు వరకు పనిదినాలే పూర్తయ్యాయి. కూలీల హాజరు శాతం పెరిగితే ఇంకా పనులు కేటాయించడానికి ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేస్తున్నారు.


వ.పా., బాపు ఆర్ట్ అకాడమి కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

చిత్రకళతో మానసిక వికాసం : మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): చిత్రకళలతో మానసిక వికాసం కలుగుతుందని, సమాజంలో చైతన్యం కలిగించవచ్చని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం రాత్రి వ.పా, బాపు ఆర్ట్ అకాడమి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నందమూరి తారక రామారావు శత జయంతిని పురస్కరించుకుని దక్షిణాది రాష్ట్రాల నుంచి వచ్చిన సుమారు 60 మంది చిత్రకారులు ఎన్టీఆర్ చిత్రాలను స్పాట్ పెయింటింగ్ ద్వారా చిత్రీకరించారు. 60 మందిలో ఐదుగురు మహిళా చిత్రకారులు ఉన్నారు. కర్నాటక, తెలంగాణ, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన ఆర్టిస్టులు ఎన్టీఆర్ చిత్రాలను చిత్రీకరించారు. కార్యక్రమంలో డి.రామకృష్ణారావు, తమిళనాడు ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ధర్మలింగరం, షణ్ముఖం, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జీ మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జయభారత రెడ్డి, పాపారావు నాయుడు, జీఎస్ఎన్, కొసనా భాస్కరరావు, చెల్లుబోయిన రాము, నక్కా వెంకటేశ్వరరావు కడలి శ్రీనివాస్, జీఎస్ఎన్.రవికుమార్, పలువురు ఆర్టిస్టులు, స్థానికులు పాల్గొన్నారు.


టీ-20 క్రికెట్ ఛాంపియన్ షిప్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు

భీమవరంలో బధిరుల టీ-20

- 12, 13 తేదీల్లో పోటీలు
- పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

భీమవరంటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బధిరులు అన్ని రంగాల్లో ముందంజలో ఉంటున్నారని, క్రికెట్‌లో ఛాంపియన్‌షిప్ స్థాయికి వెళ్లడం అభినందనీయమని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. 5వ రాష్ట్రస్థాయి బధిరుల టీ-20 క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీల బ్రోచర్ ఎమ్మెల్యే అంజిబాబు ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 5వ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను భీమవరంలో రెండు రోజులపాటు నిర్వహించడం అభినందనీయమని, తన వంతు సహకారం అందిస్తానన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూపతిరాజు మురళీ కృష్ణంరాజు, సీహెచ్ తాతారావు మాట్లాడుతూ ఈనెల 12,13 తేదీల్లో గన్నాబత్తుల క్రీడా మైదానంలో బధిరుల టీ-20 క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 10 టీమ్‌లు పాల్గొంటున్నాయని, డీఎన్నార్ కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నరసింహరాజు, కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణ రాజు(బాబు) సహకారం అందిస్తామని తెలిపారన్నారు. దాతలు, క్రీడా అభిమానుల సహకార సౌజన్యంతో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. గతంలో నాలుగు సార్లు భీమవరంలోనే పోటీలను నిర్వహించామని, ఈ ఏడాది కూడా భీమవరంలోనే చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, అసోసియేషన్ సభ్యులు ఎస్ఎస్ శర్మ, ఎండి రఫి, జి.రామచంద్రరావు, ఆర్.ఉమామహేష్, తదితరులు పాల్గొన్నారు.



పాలమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1971-72 సంవత్సరంలో పదో తరగతి చదివిన మిత్రులు

ఐదు దశాబ్దాల తర్వాత అపూర్వ కలయిక

పెనుమంట్ర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వారంతా వయసు మళ్లిన వారే.. వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ కూడా చేశారు. వారు చదివిన పాఠశాల వారికి ఇప్పటికీ నిత్య నూతనమే. ఆ పాఠశాలలో పదో తరగతి చదివిన మిత్రులు 53 ఏళ్ల తర్వాత ఆదివారం నాడు కలుసుకున్నారు. పొలమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1971-72 పదో తరగతి చదివిన విద్యార్థులు అర్థ శతాబ్దం తర్వాత కలిశారు. తాటాకు పాకలో నేలపై కూర్చుని చదువున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఒరేయ్ ఎలా ఉన్నావురా? మన సైన్స్ టీచర్ జోకులు గుర్తున్నాయా అంటూ చిన్ననాటి జ్ఞాపకాలతో ఆ వృద్ధులంతా మళ్లీ చిన్నపిల్లలయ్యారు. వీడు గొల్లపల్లి వినిస్టిన్ ఎస్‌పీఎల్ కదా అంటూ జ్ఞప్తికి తెచ్చుకున్నారు. మనకు చదువులు చెప్పిన గురువులు ఎప్పుడైనా కనపడ్డారా అంటూ ఆరా తీసుకున్నారు. మనమే వృద్ధులయ్యాం కదా.. అంటూ వారి టీచర్లకు గుర్తుగా పాఠశాలలో ఇప్పటి ఉపాధ్యాయులు కోడి చంద్రశేఖర్, పితాని పాండురంగారావు, కె.ఝాన్సీ లక్ష్మీబాయి, కేత విజయ్‌బాబును ఘనంగా సత్కరించారు. అనంతరం కుటుంబ సభ్యులతో పూర్వ విద్యార్థులు కలిసి భోజనం చేశారు. సమయం ఇట్టే గడిచి పోయింది రా.. అంటూ ఎవరికి వారు తమ ఇళ్లకు పయనమయ్యారు.

భక్తులతో కిటకిటలాడిన ద్వారకాతిరుమల ఆలయం


స్వామి వారి దర్శనానికి క్యూలైన్‌లో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలేశుని దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయంలోని అన్ని విభాగాలు కిటకిటలాడాయి. కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్రవాహనాలతో నిండింది. షుమారు 12 వేల మంది స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి. శ్రీవారి ఉచితదర్శనానికి గంటల పైబడి సమయం పట్టింది. స్వామివారిని దర్శించేందుకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్ద భక్తులు బారులు తీరారు. అయితే మధ్యాహ్నం నుంచి రద్దీ కాస్త తగ్గుముఖం పట్టింది. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

గుబ్బల మంగమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు


గుబ్బల మంగమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఏజెన్సీలో ఏ దారి చూసిన అమ్మవారి దర్శనానికి వెళుతున్న భక్తులే కనబడ్డారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంతం అమ్మవారి నామస్మరణతో మారుమోగింది. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల కోసం ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు.


హోమం చేస్తున్న కర్నాటక భక్తులు

వైభవంగా వాసవి హోమం

పెనుగొండ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పెనుగొండ వాసవి శాంతి ధామ్ నందు కర్ణాటక నుంచి వచ్చిన భక్తులు ఆదివారం వాసవి హోమం నిర్వహించారు. గోమాత పూజ, నగరేశ్వరుడికి రుద్రాభిషేకం దంపతి పూజ చేశారు. ప్రధాన అర్చకులు శిష్టా మణికంఠ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. వాసవి అమ్మవారు భానువాసర అలంకరణలో దర్శనం ఇచ్చారు. పరిసర ప్రాంత భక్తులు పూజలో పాల్గొన్నారు.

చిన్నారులపై చిత్రహింసలు

- తల్లి కళ్లెదుటే బాలుడిని వైర్‌తో బాదిన ప్రియుడు
- పట్టించుకోని తల్లి
- ఇంటి నుంచి బయటకు పరుగు తీసిన బాలుడు
- స్థానికులు గమనించి తల్లి, ఆమె ప్రియుడికి దేహశుద్ధి
- పోలీసులకు ఫిర్యాదు
- జంగారెడ్డిగూడెంలో అమానుషం


ఆస్పత్రిలో బాధిత పిల్లలతో తల్లి శారద, ప్రియుడిపై స్థానికుల దాడిని అడ్డుకుంటున్న శారద

ఏలూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలో దారుణం చోటు చేసుకుంది. మహిళతో సహజీవనం చేస్తున్న వ్యక్తి ఆమె పిల్లలను వైర్‌తో విచక్షణారహితంగా రక్తం తేలేటట్లు కొట్టాడు. బాలుడు కేకలు వేస్తూ బయటకు పరుగు తీయడంతో స్థానికులు స్పందించి మహిళ, యువకుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడితో పాటు అతడి చెల్లెలి ఒంటిపై గాయాలు స్థానికులను కలచి వేశాయి. పట్టణంలోని సుబ్బంపేటలో శనివారం రాత్రి గానాల శారద (శశి) తొమ్మిదేళ్ల కుమారుడు రాహుల్‌ను ఆమె ప్రియుడు నల్ల వెలుగుల పవన్ విద్యుత్ వైర్‌తో విచక్షణా రహితంగా కొట్టాడు. బాధ తట్టుకోలేక రాహుల్ బయటకు పరుగులు తీశాడు. రోడ్డుపై ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి వద్దకు వెళ్లి అంకుల్ నన్ను కాపాడు అంటూ భోరున ఏడుస్తూ అడిగాడు. ఆ వెంటనే పవన్, శారద వచ్చి ఇది మా ఇంట్లో గొడవ మీకెందుకు అని ప్రశ్నించి రాహుల్‌ను తీసుకు వెళ్లడానికి ప్రయత్నించారు. గాయాలతో ఉన్న రాహుల్‌ను చూసి ఇంటి చుట్టు పక్కల వారు చలించిపోయారు. పవన్, శారదలపై ఆగ్రహంతో వారిద్దరికీ దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాలుడు రాహుల్, అతడి చెల్లెలు రేణుకను ఆసుపత్రికి తరలించారు. పవన్ అక్కడి నుంచి పరారయ్యాడు.

తల్లి కళ్లెదుటే హింసించినా..

ఆస్పత్రిలో శనివారం రాత్రి బాలలకు వైద్య సేవలందించి ఆదివారం ఉదయం వారిని ప్రశ్నించగా విచారించగా చిత్రహింసలను ఏకరువు పెట్టారు. ప్రతీరోజు రాత్రి ఇంట్లో పవన్ మద్యం సేవిస్తూ తల్లి కళ్లెదుటే రాహుల్, రేణుకను సెల్‌ఫోన్ వైర్‌తో విచక్షణారహితంగా కొట్టేవాడు. కన్నతల్లి ఏమాత్రం పవన్‌ను వారించేదికాదు. కొంతకాలంగా మాట వినడంలేదంటూ పవన్‌తో పాటు శారద కూడా పిల్లలను కొట్టేది. గట్టిగా అరుస్తున్నారని నోట్లో గుడ్డలు కుక్కి కూడా కొట్టేవారు. కొంత కాలం క్రితం రాహుల్ నోటిపై గట్టిగా కొట్టడంతో పళ్లు ఊడిపోయాయి. ఆ బాధలో ఉన్న బాలుడి నోట్లో పచ్చి మిరపకాయ పెట్టి రాక్షసానందం పొందారు. బాలిక రేణుకను 20 రోజుల క్రితం సెల్‌ఫోన్ చార్జర్ వైర్‌తో పవన్ గట్టిగా కొట్టడంతో ఎడమ కంటిపై తీవ్రగాయమైంది. బాలిక ఒళ్లంతా మానిన గాయాల మచ్చలతో నిండిపోయింది. శారద, పవన్ పిల్లలిద్దరినీ క్రూరంగా చిత్రహింసలు పెట్టారు. గాయాలకు చికిత్స చేశామని ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ బేబీకమల తెలిపారు.

కలెక్టర్ సీరియస్

చిన్న పిల్లలను క్రూరంగా హింసించడంపై కలెక్టర్ వెట్రిసెల్వి సీరియస్ అయ్యారు. ఏరియా ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ బేబీకమల, ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలాతో ఫోన్‌లో మాట్లాడి పిల్లల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఆసుపత్రి వైద్యులు, ఐసీడీఎస్ అధికారుల సంరక్షణలో చిన్నారులను ఉంచాలని ఆదేశించారు. బాధిత చిన్నారులను డీసీహెచ్ఎస్, ఐసీడీఎస్ పీడీ, శిశు సంరక్షణ అధికారులు, డీఎస్పీ, సీఐ పరామర్శించారు.

భర్తతో విడిపోయి..

కామవరపుకోట మండలం తాడిచర్లకు చెందిన గానాల శారద (శశి)కు తాడేపల్లిగూడెం వద్ద ఉన్న కూనవరం గ్రామానికి చెందిన గానాల గణేశ్‌తో పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఉదయ రాహుల్, జశిత రేణుక ఇద్దరు పిల్లలు. కొంతకాలం తర్వాత గణేశ్ మద్యానికి బానిసై భార్యా పిల్లలను పట్టించుకోకపోవడంతో శారద భర్తను విడిచిపెట్టి పిల్లలతో తాడిచర్లలో తల్లి వద్ద ఉంటుంది. అదే గ్రామంలో గ్రామ వలంటీరుగా పనిచేసే నల్లవెలుగుల పవన్‌తో శారదకు పరిచయం ఏర్పడింది. దాదాపు ఐదేళ్ల నుంచి వారు సహజీవనం చేస్తున్నారు. శారద తమ్ముడికి పెళ్లి అయ్యే వరకు కొంతకాలం బయట ఉండాలని తల్లిదండ్రులు చెప్పారు. దీనితో శారద పిల్లలను తీసుకుని జంగారెడ్డిగూడెం సుబ్బంపేటలోని నేతాజీ నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటోంది. ఆమె ప్రియుడు పవన్ కూడా వాళ్లతోనే ఉంటున్నాడు. పవన్, శారద ఇద్దరూ వేర్వేరు హోటళ్లలో పనిచేస్తున్నారు.

కాగా ఈ సంఘటనపై బాలుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని డీఎస్పీ యు. రవిచంద్ర తెలిపారు. నిందితుడిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

ఆయుష్‌లో అక్రమాలు

- నకిలీ ధ్రువీకరణ పత్రాలతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి
- 650 రోజులుగా మరో ఉద్యోగి గైర్హాజరు
- ఉన్నతాధికారులకు నివేదిక



ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన వైద్య విధానాలను ప్రోత్సహించే ఆయుష్ శాఖలో అక్రమాల పర్వం కొనసాగుతోంది. ఒక ఉద్యోగి నకిలీ ధ్రువీకరణ పత్రాలతో విధులు నిర్వహిస్తున్నాడు. మరొకరు ఏడాదిన్నరకు పైగా విధులకు హాజరుకు కావడం లేదు. వారి ఆగడాలపై ఆయుష్‌శాఖ కమిషనర్, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ విచారించి కలెక్టర్‌కు నివేదించారు. ఒకరు నకిలీ ధ్రువీకరణ పత్రాలతో విధులు నిర్వహించడం, మరో ఉద్యోగి 650 రోజులకుపైగా విధులకు గైర్హాజరవుతున్నట్లు రుజువైంది. ఉన్నతాధికారులు తదుపరి చర్యలకు సమాయత్తమవుతున్న దశలో అక్రమాలపై ఫిర్యాదు చేసిన అదేశాఖలో దివ్యాంగుడైన చిరుద్యోగిపై బెదిరింపులు మొదలయ్యాయి.

ఆయుష్‌శాఖ జోన్-2 పరిధిలోని ఏలూరు ప్రాంతీయ ఉపసంచాలకుని (ఆర్డీడీ) అజమాయిషీలో ఆయుర్వేదం, హోమియోపతి వైద్య సేవల నిమిత్తం జిల్లావ్యాప్తంగా వైద్యశాలలను నిర్వహిస్తున్నారు. ఏలూరు ఆర్డీడీ కార్యాలయంలో ఒక్క వ్యక్తి కారుణ్య నియామకంపై ఉద్యోగం పొందాడు. విధులు చేపట్టిన నాటి నుంచి దుష్ప్రవర్తన, లంచగొండితనం షరామామూలే అన్నట్టుగా కొనసాగుతున్నాడు. పదోన్నతికోసం అవసరమైన విద్యార్హత పొందడానికి కూడా అడ్డదారులనే ఎంచుకున్నాడు. తాడేపల్లిగూడెంలో ఓ ప్రైవేటు విద్యాసంస్థలో అడ్మిషన్ పొందిన ఇతను ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకున్నాడు. ఆయా తేదీల్లో కార్యాలయ విధులకు సెలవు పెట్టాల్సి ఉంది. దీనికిభిన్నంగా పరీక్షలు జరిగిన తేదీల్లో విధులకు హాజరైనట్టు ఉద్యోగి సంతకాలు పెట్టడం, మరోవైపు సంబంధిత విద్యార్హత సాధించినట్టు సర్టిఫికెట్లు అందజేసి పదోన్నతి పొందడం గమనార్హం. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగి అసలు పరీక్షలనే రాయలేదని సమాచారం. ఈ విషయం వెలుగులోకి రావడంతో కార్యాలయ హాజరుపట్టీలో సంబంధిత పరీక్షలు జరిగిన రోజుల్లో విధులకు క్యాజువల్ లీవ్ పెట్టినట్టు దిద్దివేతలు, కొట్టివేతలున్నట్టు ఉన్నతాధికారుల పరిశీలనలో తేలింది.

ఆర్డీడీ ఆఫీసులో తిష్టవేసిన ఈ ఉద్యోగి కారుణ్య నియామకాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల క్లియరెన్స్ తదితర పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారి నుంచి పెద్దమొత్తాల్లో లంచాలు తీసుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి.

విధులకు గైర్హాజరు

దర్మాజీగూడెంలో పనిచేస్తున్న మరో ఉద్యోగి పని సర్దుబాటు(వర్క్ అడ్జస్ట్‌మెంట్)పై ఇక్కడ పనిచేస్తున్నారు. రోజువారీ విధులకు హాజరవుతున్నట్టు నమోదుచేయాల్సిన ఎఫ్ఆర్ఎస్ హాజరుగాని, అటెండెన్స్ బుక్‌లోగాని సంతకం చేయకుండానే జీతాలు చెల్లిస్తున్నట్టు రుజువైంది. ఉద్యోగి గైర్హాజరుపై స్థానిక ఆయుర్వేద వైద్యశాల వైద్యుడు ఏలూరులోని ఆర్డీడీ కార్యాలయానికి సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేస్తున్నప్పటికీ జీతభత్యాల చెల్లింపులు జరగడం గమనార్హం. విధినిర్వహణలో అక్రమాలకు పాల్పడుతున్న ఈ ఇద్దరు ఉద్యోగుల నిర్వాకంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేయడం, విచారణలో వాస్తవాలు బహిర్గతం కావడంతో ఇపుడు ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలంటూ తోటి ఉద్యోగిపై బెదిరింపులకు దిగడం ఆయుష్‌శాఖ ఏలూరు ఆర్డీడీ కార్యాలయంలో చర్చనీయాంశమైంది. దివ్యాంగుడైన ఫిర్యాదుదారు మరో ఏడాదిలో ఉద్యోగవిరమణ చేయనుండగా, ఫిర్యాదును ఉపసంహరించుకోకపోతే రిటైర్మెంట్ ఆర్థిక ప్రయోజనలేవీ ప్రభుత్వం నుంచి అందకుండా చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నట్టు తెలిసింది.

కమిషనర్‌కు నివేదిక పంపించా

డాక్టర్ కల్పనా కటాక్షం, ఇన్‌చార్జి ఆర్డీడీ

ఇద్దరు ఉద్యోగుల పనితీరుపై ఫిర్యాదువచ్చిన విషయం వాస్తవమే. సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగికి జనవరి జీతభత్యాల చెల్లింపు నిలిపివేశాం. విద్యార్హతలు, హాజరుపట్టీలో దిద్దివేతలు, తదితర ఆరోపణలు వచ్చిన మరో ఉద్యోగిపై విచారణచేసిన నివేదికను ఆయుష్‌శాఖ కమిషనర్‌కు పంపించాను. కమిషనర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం విచారణ నివేదికలోని అంశాలను బహిర్గతం చేయలేను. వారిద్దరిపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు అందింది.

కుటుంబ సమస్యలతో ఉరి వేసుకుని ఆత్మహత్య

పెంటపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన ఆదివారం పడమర విప్పర్రు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పడమర విప్పర్రు గ్రామానికి చెందిన చందనాల పెద వెంకటేశ్వరరావు (50) వ్యవసాయ కూలీ. అతడికి ఇద్దరు కుమార్తెలకు వివాహమైంది. చిన్న కుమార్తె ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం, అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైన వెంకటేశ్వరరావు ఆదివారం పొలంలోని గేదెల పాక వద్ద దూలానికి తాడుతో ఉరి వేసుకుని చనిపోయాడు. భార్య ఉమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ స్వామి తెలిపారు.

రైలు నుంచి జారి పడి..

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న రైలు నుంచి జారిపడి ఒక యువకుడు మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమడోలు ఫ్లైఓవర్ బ్రిడ్జిలో రైలుపట్టాలపై గుర్తు తెలియని యువకుడి మృతదేహం ఉన్నట్లు రైల్వే ఎస్ఐ పి సైమన్‌కు ఆదివారం సమాచారం అందింది. సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు సుమారు 25 నుంచి 30 ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. 5.6 అడుగుల ఎత్తు కల్గి తెలుపురంగు పొట్టి చేతుల టీ షర్టు, నలుపు, నీలం రంగు షార్టు ధరించి ఉన్నాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారిపడి మరణించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చీటీ సొమ్ము ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతం శివ గోపాలపురం ప్రాంతానికి చెందిన అందే తేజశ్రీ ఫ్యాన్సీషాపు నిర్వహిస్తుంది. స్థానికంగా ఒక మహిళ వద్ద నెలకు రూ25 వేల చీటీ కడుతోంది. పాడుకున్న సొమ్మును ఎక్కువ వడ్డీ ఇస్తానని నమ్మబలికి సొమ్ములను ఆమె వద్దే ఉంచుకుంది. ఎంత కాలానికి సొమ్ములు ఇవ్వకుండా ఆమె ఊరు వదిలి వెళ్లిపోయిందని, ఫోన్ స్విచ్ఆఫ్‌లో ఉందని మనస్తాపానికి గురై ఆదివారం ఉదయం సర్ఫ్ లిక్విడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా కేసు నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం మృతిచెందాడు. గొల్లగూడెంకు చెందిన పంపన వెంకటస్వామి(55) శనివారం మోటార్ సైకిల్ వెళుతుండగా గొల్లగూడెం అడ్డరోడ్డు వద్ద మరో మోటార్ సైకిల్ వేగంగా ఢీకొంది. వెంకటస్వామి తీవ్రంగా గాయపడడంతో స్థానికులు ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు.

అగ్నిప్రమాదంలో..

తాడేపల్లిగూడెం రూరల్ ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ శనివారం అర్థరాత్రి మృతి చెందింది. తాడేపల్లిగూడెం మండలం పట్టింపాలెంకు చెందిన బొమ్మగంటి రామయమ్మ (68) ఈనెల 1న టీ తాగేందుకు గ్యాస్ పొయ్యి వెలిగించుకోగా మంటలు వ్యాపించాయి. కాలిన గాయాలు కావడంతో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పపొందుతూ అర్థరాత్రి మృతి చెందారు. దీనిపై కుమారుడు దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

నేడు వీరంపాలెంలో సామూహిక అక్షరాభ్యాసం

తాడేపల్లిగూడెం రూరల్ ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి, సరస్వతి అమ్మవారి జన్మదినం పురస్కరించుకుని వీరంపాలెం బాలాత్రిపుర సుందరి పంచాయతన క్షేత్రంలో మేధా సరస్వతి సమక్షంలో సోమవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించ నున్నారు. క్షేత్రంలో అమ్మవారి ఆశీస్సులతో తమ పిల్లలకు విద్యా బుద్ధులు ప్రసాదించాలని జిల్లాలోనే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా తల్లిదండ్రులు తరలి వస్తుంటారు. ఆలయ క్షేత్రంలో ఎంతమంది వచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా అక్షరాభ్యాసాలు చేసేవిధంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక బారికేడ్‌లు, పూజలకు ప్రత్యేక బెంచ్‌లు ఏర్పాటుచేసినట్టు ఆలయ వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకట రమణ సిద్ధాంతి తెలిపారు.

భీమవరం హాస్పిటల్స్‌లో పీజీ విద్య


పీజీ విద్యార్థులతో భీమవరం హాస్పిటల్స్ యాజమాన్యం

భీమవరం టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చిన అమిరంలోని భీమవరం హాస్పిటల్స్ వైద్య సేవలతో పాటు వైద్య విద్య అందిస్తుందని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కేవీ కృష్ణంరాజు, చైర్మన్ గోపాలరాజు, ఆర్.శ్రీనివాస్ రాజు తెలిపారు. ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మత్తు విభాగానికి సంబంధించి భీమవరం హాస్పిటల్‌కు నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్ డిప్లొమెట్ ఆఫ్ నేషనల్ బోర్డు (డీఎన్‌బీ) పోస్టు గ్రాడ్యుయేషన్‌కు అనుమతి ఇచ్చిందన్నారు. కేరళకు చెందిన ఇద్దరు విద్యార్థులు డీఎన్‌బీ చేసేందుకు తమ హాస్పిటల్‌ను ఎంపిక చేసుకున్నారని తెలిపారు. 20 ఏళ్లుగా అన్ని రకాల స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందిస్తున్నామని, ఇపుడు పీజీ వైద్య విద్యా కార్యక్రమాలను జిల్లాలో మొదటిసారిగా ప్రారంభిస్తున్నామన్నారు. అనస్థీషియా విభాగంలో పీజీ విద్యకు ఇద్దరు విద్యార్థులు చేరారని, త్వరలో రేడియాలజీ ఇతర స్పెషాలిటీ వైద్య విభాగాలలో సీట్లు అందుబాటులోకి రానున్నాయన్నారు.





మావుళ్లమ్మ ఉత్సవాలలో నృత్య ప్రదర్శనలతో అలరించిన చిన్నారులు

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

భీమవరం టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ ఆలయ వార్షిక మహోత్సవాల్లో భాగంగా ఆదివారం కళావేదికపై చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. గునుపూడికి చెందిన ఉమా సోమేశ్వర కూచిపూడి నాట్య కళాక్షేత్రం బృందం నిర్వహించిన కూచిపూడి, భరత నాట్య ప్రదర్శన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. దాదాపు రెండు గంటలపాటు చిన్నారులు పలు కీర్తనలకు, భక్తి గీతాకు నృత్యాలు చేశారు. గురువు ఎస్ వైష్ణవి మణికంఠ పర్యవేక్షణలో చిన్నారుల ప్రదర్శన మంత్రముగ్ధులను చేసింది. మధ్యాహ్నం 12 గంటలకు హరే శ్రీనివాస కోలాట భజనమండలి కోలాట భజన నిర్వహించారు. 3 గంటలకు నల్లజర్ల శ్రీరామకృష్ణ భజన సమాజం వారిచే భజన, సాయంత్రం 4 గటలకు దిరుసుమర్రుకు చెందిన కెల్లా జగన్నాథం ప్రవచనాలు జరిగాయి. రాత్రి 9 గంటలకు అత్తిలికి చెందిన సత్య ఆర్కెస్ట్రా వారిచే సినీ సంగీత విభావరి నిర్వహించారు.



చిన్నారులను పరామర్శిస్తున్న ఆర్డీవో రమణ, తహసీల్దారు స్లీవ జోజి

బాధిత చిన్నారులకు ఆర్డీవో, తహసీల్దార్ పరామర్శ

ఏలూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) :జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు రాహుల్, రేణుకలను జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.వి.రమణ, తహసీల్దార్ కె.స్లీవ జోజి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా పిల్లల ఆరోగ్య పరిస్థితిని ఆర్డీవో రమణ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ స్లీవ జోజి పిల్లలకు నూతన వస్త్రాలను ఆర్డీవో చేతుల మీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో బ్యూలా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు కూటమి నేతల ప్రచారం

పెదవేగి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : ఎన్డీయే కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని పెదకడిమి సర్పంచ్ కొసరాజు బలరామకృష్ణ చౌదరి ఓటర్లను అభ్యర్థించారు. ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని కోరుతూ పెదవేగి మండలం పెదకడిమిలో టీడీపీ నాయకులు ఆదివారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొసరాజు వరప్రసాద్, బి.సుధాకర్, ఉండవల్లి చిట్టియ్య, అయినా వెంకటనారాయణ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్దపీట : బీజేపీ

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే తలంపుతోనే ప్రధాని మోదీ పేదలకు అగ్రస్థానం ఇచ్చి బడ్జెట్‌కు రూపకల్పన చేశారని బీజేపీ నాయకులు నడపన దానభాస్కర్‌రావు పేర్కొన్నారు. అన్ని వర్గాలకు మేలు చేకూర్చేలా ఉన్న బడ్జెట్‌ను రూపొందించడం అభినందనీయమని అన్నారు.

రైతాంగాన్ని మోసం చేసిన కేంద్రం : కె.శ్రీనివాస్

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం మరోసారి రైతాంగాన్ని, కౌలు రైతులను మోసం చేసిందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రైతాంగానికి, కౌలు రైతులకు సరైన కేటాయింపులు చేయకపోవడం అన్యాయమని, అన్నదాతలను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు మోసాలు చేస్తుంటే బతకడం ఎలా అని ప్రశ్నించారు.ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రైతాంగాన్ని, కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు.

కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితి పెంపుపై హర్షం

లింగపాలెం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు ఎంతో మేలు చేస్తుందని చింతలపూడి నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు మోరంపూడి మల్లికార్జునరావు పేర్కొన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డ్ పరిమితిని మూడు నుంచి ఐదు లక్షలకు పెంచడం సంతోషకరమని అన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు గరిమెళ్ల చలపతిరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ వల్ల పరిశ్రమల స్థాపనకు అవకాశం లభిస్తుందని, పోలవరం పూర్తవ్వడంతో పాటు చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు భరోసా కలుగుతుందని పేర్కొన్నారు.

జీలకర్రగూడెంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

కామవరపుకోట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : జీలకర్రగూడెం హైస్కూలు వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వేమగిరి పరమహంస యోగానంద కంటి వైద్యశాల వైద్య నిపుణులు నేత్ర పరీక్షలు నిర్వహించారు. 99 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్ళు అందజేశారు. ఆరుగురిని శస్త్ర చికిత్సల నిమిత్తం వేమగిరికి తీసుకెళ్ళారు. కార్యక్రమంలో క్లబ్ నాయకులు బాలవర్ధి రాజు, మండలపు రామకృష్ణ, యర్రంరాజు, ఆర్.ఆర్.రత్నకుమారి, ఆర్.ఆర్.రంగరాజు, పాటిమళ్ళ సుబ్బారావు, వీర రామకృష్ణంరాజు, మంతెన మాధవశర్మ, కూనపురాజు వెంకటరాజు, ఎల్.ఎస్.శర్మ, క్లబ్ అధ్యక్షులు చెలికాని కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలి

టి.నరసాపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని సీపీఐ జిల్లా సమితి సభ్యులు బి.ఎన్.సాగర్ ప్రభుత్వాన్ని కోరారు. టి.నరసాపురంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో గిరిజన గ్రామాలైన మర్రిగూడెం, అబ్బుల్లాపురం, మల్లప్పగూడెం, రామన్నగూడెం, బచ్చులేటి గూడెం, సాలిగూడెం వంటి గిరిజన గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని అన్నారు.

చిన్నారులను గాయపర్చిన దోషులను శిక్షించాలి

కామవరపు కోట,ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : చిన్నారులను గాయపరిచిన నిందితుడిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు, మహిళా సమాఖ్య నాయకులు రాములమ్మ, నాగమణిలు పోలీసులను, అధికారులను కోరారు. జంగారెడ్డి గూడెంలో ఉదయ్, రేణుక అనే చిన్నారులను విచక్షణా రహితంగా గాయపర్చడం అమానవీయమని అన్నారు. కరెంటు వైరుతో తీవ్రంగా గాయపరిచి కారం చల్లి చిన్నారులకు నరకం చూపించాడని, వెంటనే అతనిని అరెస్టు చేయాలని, బాలలను సంరక్షించాలని, వారికి సరైన వైద్యం చేయించాలని కోరారు.

లక్ష డప్పుల కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

ఎంఆర్పీఎస్ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు మురళీ కృష్ణ

పెదవేగి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) :హైదరాబాద్‌లో ఈ నెల 7వ తేదీన జరిగే లక్ష డప్పులు - వేల గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్పీఎస్ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి మురళీ కృష్ణ పిలుపునిచ్చారు. పెదవేగి మండలం వేగివాడలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు అందించిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని కేక్‌కట్ చేసి, వేడుకలు జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో చేపట్టిన లక్ష డప్పులు - వేల గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : పొగమంచు కారణంగా రోడ్డు కనపడక కారు అదుపుతప్పి ఒక చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. నిడదవోలులోని గణపతి సెంటర్‌కు చెందిన సింహాద్రి శంకర్(23) ఫోటో గ్రాఫర్‌గా వృత్తి కొనసాగిస్తున్నాడు. ఆదివారం తెల్లవారు జామున తన స్నేహితులు ఏపుగంటి మారుతి, షేక్ రహీమ్, సతీష్‌లు కలిసి తెనాలిలోని ఒక పెళ్ళి కార్యక్రమానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో ఉదయం 5గంటలకు ఏలూరు జిల్లా భీమడోలు సుగర్ ఫ్యాక్టరీ సమీపంలో కారు చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శంకర్, రహీమ్, మారుతీ, సతీష్‌లకు తీవ్ర గాయాలవగా ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నారు.

పేకాట, కోడి పందేల శిబిరాలపై దాడులు

ఏలూరు క్రైం/పెదపాడు/పెదవేగి/జీలుగుమిల్లి,ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : వేర్వేరు చోట్ల కోడి పందేలు, పేకాట నిర్వహిస్తున్న శిబిరాలపై దాడులు నిర్వహించి నట్టు పోలీసులు తెలిపారు. ఏలూరు రూరల్ మండలం పోణంగి శివారులో ఆదివారం సాయంత్రం పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో రూరల్ ఎస్ఐ సిహెచ్ దుర్గాప్రసాద్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి దాడి చేశారు. అక్కడ పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి 2,900నగదు, రెండు మోటారు సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. పెదపాడు మండలం గుడిపాడులో పేకాడుతున్నారనే సమాచారం మేరకు ఎస్సై కట్టా శారద సతీష్ దాడి చేసి సిబ్బందితో కలిసి దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.10,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. పెదవేగి మండలం కొండలరావుపాలెంలో కోడి పందాల శిబిరంపై దాడిచేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. ఈ దాడిలో ఒక పుంజు, 4వేలు నగదు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో పేకాట స్థావరంపై ఎస్సై పి.నవీన్ కుమార్ దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకోగా బొత్తప్పగూడెంలో కోడి పందేల శిబిరంపై దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు.

ఆగని మట్టి తవ్వకాలు

• పట్టించుకోని అధికారులు

ద్వారకా తిరుమల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : సత్తాల చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు ఆగడం లేదు. గత కొన్నాళ్లుగా నిర్విరామంగా ఈ తంతు జరుగుతోందని ఆరోపణలు ఉన్నాయి. ఈ తతంగాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదు.. నెలలు తరబడి కొందరు వ్యక్తులు ఇక్కడి చెరువులోని మట్టిని తవ్వి అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈకారణంగా చెరువు గుంతలు పడి ప్రమాదకరంగా మారుతోందని గ్రామస్థులు మొత్తుకుంటున్నా ఈవైపు ఏఅధికారీ కన్నెత్తి చూడటం లేదు. తవ్విన మట్టిని కైకలూరు, భీమడోలు, భీమవరం, తదితర ప్రాంతాల్లోని రియల్ ఎస్టేట్ భూములను చదును చేసుకునేందుకు తరలిస్తున్నట్టు చెబుతున్నారు..దూరానికి అనుగుణంగా ఈ మట్టిని టిప్పర్ రూ.6 వేల నుంచి పది వేల రూపాయల వరకూ అమ్ముకుని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మామూళ్ల మత్తులో ఉన్న కొందరు అధికారులు అక్రమ తవ్వకాలను ఆపకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఈ మట్టి తవ్వకాలను నిలుపుదల చేసి చెరువు ఆకృతిని, ఉనికిని కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మట్టిని లారీల్లో తరలిస్తున్న దృశ్యం

మద్యం మత్తులో వాహనాలు నడిపితే సహించేది లేదు

• మందు బాబులకు ఎస్ఐ హెచ్చరిక

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 19 మందిపైన, మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న ఐదుగురిపైన ఏలూరు టూటౌన్ సీఐ వై.వి.రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ రామకృష్ణ ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు టూటౌన్ సీఐ రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ రామకృష్ణ ఆదివారం రాత్రి టూటౌన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 19 మందిని గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. బ్రీత్ ఎనలైజర్లతో వాహనాలు నడుపుతున్న వారిని తనిఖీలు చేయగా ఐదుగురు మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్నట్టు గుర్తించారు. దీంతో వీరిపై కూడా కేసు నమోదు చేశారు. ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు అనుసరించి ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు



రోడ్డుకు మరమ్మతులు నిర్వహిస్తున్న కార్మికులు

చింతలపూడిలో రోడ్లకు మరమ్మతులు

చింతలపూడి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నగర పంచాయతీలోని రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమం ప్రారంభమైంది. ఇప్పటి వరకు ఆర్అండ్‌బీ మెయిన్ రోడ్డుకు మరమ్మతులు నిర్వహించారు. ప్రస్తుతం 20 వార్డుల్లో ప్రధానమైన గోతులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి మరమ్మతులు చేపడుతున్నట్టు మునిసిపల్ కమిషనర్ డి.పావని తెలిపారు. పాతచింతలపూడి, సమ్మెట వారిగూడెం, నాగిరెడ్డిగూడెం, మెరకవీధి ప్రాంతాల్లో సీసీ రోడ్లు, తారు రోడ్లు ఉన్న చోట్ల ఎక్కువగా ప్రజలు తిరిగే ప్రాంతాల్లో ఉన్న గోతులను పూడ్చే కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. పాత చింతలపూడిలో ఆదివారం చేపడుతున్న పనులపై పట్టణ టీడీపీ కార్యదర్శి బోడా నాగభూషణం మాట్లాడుతూ గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో ప్రధాన రోడ్డే కాదు నగర పంచాయతీలో పలు వార్డుల్లో రోడ్లు గోతులమయమై ప్రజలు ఇబ్బందులు పడ్డారని అన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి చదరంగం పోటీలు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) :ఏలూరు శ్రీభారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అబ్రహం, జారీ పాస్కరో చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరు జిల్లా అండర్ -16 చెస్ టోర్నమెంట్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి న్యాయవాది కాత్యాయినీ హాజరై పోటీలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ చదరంగం ద్వారా ఆలోచనా శక్తి పెరుగుతుందన్నారు.ముఖ్య అతిథి ఆయుష్ ఆసుపత్రి వైద్యులు కె.హారిక చేతుల మీదుగా జి.అభిషేక్ అబ్రహం (ప్రథమం), జి.అనురూప్ మోషే(ద్వితీయ), ఎం.ఆసిస్ (తృతీయ), ఎస్.కె.పర్వాన్, ఎన్.నిత్యశ్రీలకు అవార్డులు అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రాట్నాలమ్మకు పూజలు

పెదవేగి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) :పెదవేగి మండలం రాట్నాలకుంట శ్రీరాట్నాల మ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మ వారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి పాలపొంగలి నైవేద్యంలా సమర్పించి తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. ఆలయ అర్చకులు పావులూరి వీర వెంకట రామ సత్యనారాయణ శర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్య శర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో నతీష్ కుమార్ తెలిపారు.

అర్జీల స్వీకరణ తాత్కాలికంగా రద్దు

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా కె.ఆర్.పురంలోని ఐటీడీఏ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం, ప్రతి బుధవారం నిర్వహించే గిరిజన దర్బార్‌ను తాత్కాలికంగా రద్దు చేసినట్టు ప్రాజెక్టు ఆఫీసర్, ఆర్అండ్ఆర్ ఆఫీసర్ కె.రాములు నాయక్ తెలిపారు. ఫిబ్రవరి 27న టీచర్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు, మార్చి 3న ఓట్ల లెక్కింపు, మార్చి 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు. అప్పటి వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక, గిరిజన దర్బార్ కార్యక్రమాలను రద్దు చేసినట్టు పీవో తెలిపారు.

దుర్గమ్మ, గద్దె రాజుల జాతర

బుట్టాయగూడెం, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోర్సవారిగూడెం పంచాయతీ కామవరం గ్రామంలో ఉన్న దుర్గమ్మ, గుబ్బల మంగమ్మ, నాగ దుర్గాదేవి, గద్దె రాజుల మాఘ శుద్ధ పౌర్ణమి జాతర మహోత్సవాలు ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ఆలయ పీఠాధిపతి వర్స పుల్లారావు తెలిపారు. జాతర జరిగే ఐదు రోజులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, హోమాలు, నైవేద్యాలు, పసుపు, కుంకుమ, సౌభాగ్య విశేష పూజలు జరుగుతాయని తెలిపారు. 12న అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు.

యథేచ్ఛగా కోడి పందేలు

కామవరపుకోట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కామవరపుకోట మండలం తూర్పు యడవల్లి పంచాయతీలోని జడ్పీ హైస్కూల్ సమీపంలో యథేచ్ఛగా కోడి పందేలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.కోడి పందేల వ్యసనాలకు బానిసై కొంతమంది ఇబ్బందులు పడుతున్నారని పలువురు పేర్కొన్నారు. కోడి పందేలను నిర్మూలించాలని పలువురు కోరుతున్నారు.

గ్రంథాలయాలపై అవగాహన

పెదవేగి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన గని అని పెదవేగి శాఖా గ్రంథాలయ గ్రంథ పాలకుడు తోట అరుణ్ కుమార్ అన్నారు. పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు.చదువుతో పాటు గ్రంథ పఠనం చేయడం వ్యక్తి ఉన్నతికి దోహదపడుతుందన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథ పఠనం చేయాలని, అదేవారి జీవితాన్ని ఉన్నతమైన దిశగా నడిపిస్తుందని అన్నారు.

చేబ్రోలులో డ్రంకెన్ డ్రైవ్

ఉంగుటూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి వెంబడి చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎం.సూర్య భగవాన్ తెలిపారు. అలాగే బహిరంగంగా మద్యం తాగి పది మందిపై కేసు నమోదు చేసినట్టు ఆయన వివరించారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

కుక్కునూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దామరచర్ల గ్రామంలో తెలంగాణ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు తెలిపారు. 10 మద్యం సీసాలను కలిగి ఉన్న మహిళపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మండలంలో సారా, తెలంగాణ మద్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడిలో ఎస్సై వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సాయం

భీమడోలు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : గుండుగొలనులో దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో 60మంది దివ్యాంగులకు బియ్యం, పండ్లు, నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. స్థానిక దాత దాట్ల అర్జునరావు, శకుంతల ఆర్థిక సహకారంతో వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పేరిచర్ల సునీల్ వర్మ, శ్యామల రాజు, గేదెల శ్రీను, నోములు, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కాపు కల్యాణ మండపం అభివృద్ధికి పలు తీర్మానాలు

ద్వారకా తిరుమల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కాపు సంక్షేమానికి కృషి చేస్తామని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపం ట్రస్టు చైర్మన్ పుప్పాల వాసు బాబు పేర్కొన్నారు. ద్వారకా తిరుమల కొండపై ఉన్న కాపు కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం ట్రస్టు బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండపం అభివృద్ధికి పలు తీర్మానాలు చేశారు. ఇందులో భాగంగా ఆంజనేయ కల్యాణ మండపాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే మండపం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు తీర్మానించారు. అలాగే రూ.3.50లక్షలు వెచ్చించి వాటర్ ప్యూరిఫైర్ యూనిట్ ఏర్పాటుకు తీర్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నమిల్లి వెంకట్రాయుడు, కోశాధికారి మాకా శ్రీనివాస్, సభ్యులు మైగాపుల మోహనరావ్, మహేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.



కల్యాణ మండపంలో జరుగుతున్న సమావేశం



కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జెస్సీరాజ్‌కు సన్మానం నిర్వహించిన దృశ్యం

ప్రధాన మంత్రి బాల పురస్కార్ అవార్డు గ్రహీత జెస్సీరాజ్‌కు సన్మానం

దెందులూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : స్కేటర్ క్రీడా పోటీల్లో అంతర్జాతీయ స్థాయి ప్రతిభను కనబరిచి దేశ ప్రధాని మోదీ, రాష్ట్రపతి ముర్ము, చేతుల మీదుగా ప్రధానమంత్రి బాల పురస్కార్ అవార్డును అందుకున్న జెస్సీ రాజ్‌ను పలువురు ఘనంగా సన్మానించారు.ఆదివారం దెందులూరు మండలం జోగన్నపాలెం గ్రామానికి చెందిన మాత్రపు రాజారావు మనుమరాలు మాత్రపు సురేష్ కుమార్, రాధ దంపతుల కుమార్తె మాత్రపు జెస్సీ రాజ్‌ను మాత్రపు కుటుంబ సభ్యులు, జోగన్నపాలెం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఏలూరు సీఎస్ఐ చర్చి విచారణ కౌన్సిల్ రెవ పాస్టర్ ఆనందకొండ, రెవ పాస్టర్లు అలెగ్జాండర్, జాషువా ఆధ్వర్యంలో జోగన్నపాలెంలోని మాత్రపు సురేష్, రాధల నివాసంలో ఘనంగా సన్మానించి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం టీడీపీ రాష్ట్ర నాయకులు జోగన్నపాలెం సర్పంచ్ పసుమర్తి రాజేశ్వరి, మాజీ సర్పంచ్ పసుమర్తి ప్రభాకర్, సహకార బ్యాంకు మాజీ అధ్యక్షుడు డాక్టర్ పసుమర్తి మధులు జెస్సి రాజ్‌ను ఘనంగా సన్మానించారు.అలాగే గోపన్నపాలెంలోని శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియేల్ జెస్సీరాజ్‌ను ప్రత్యేకంగా సన్మానించారు.



జాతీయ రహదారిపై పూర్తిగా కాలిపోయిన లారీ క్యాబిన్

అప్పనవీడు వద్ద లారీ క్యాబిన్‌లో మంటలు

పెదపాడు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం అప్పనవీడు వద్ద జాతీయ రహదారిపై వెళ్తున్న లారీ క్యాబిన్‌లో ప్రమాద వశాత్తు ఆదివారం మంటలు చెలరేగాయి.. పెదపాడు మండలం వసంతవాడలో ధాన్యం బస్తాలను లోడు చేసుకునేందుకు వెళ్తుండగా మార్గ మధ్యలో లారీ క్యాబిన్‌లో మంటలు వ్యాపించాయి. లారీ డ్రైవర్ మెరుగు భాగ్యరాజు వెంటనే లారీని రోడ్డు పక్క నిలుపుదల చేసి హనుమాన్ జంక్షన్ ఫైర్ స్టేషన్‌కి సమాచారం అందించాడు.ఫైర్‌సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే లారీ పూర్తిగా కాలిపోయింది.

ప్రమాదం జరిగినట్టు నటించి సెల్ చోరీ

ద్వారకా తిరుమల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్ నుంచి పడి రోడ్డు ప్రమాదం జరిగినట్టు నటించి, సాయం చేసేందుకు వచ్చిన వ్యక్తి నుంచి సెల్ ఫోన్‌ను కొట్టేశాడు ఓ ప్రబుద్ధుడు.. ద్వారకా తిరుమల బస్టాండ్ వద్ద జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. కొయ్యలగూడెం మండలం కె.రాజవరానికి చెందిన ఉస్సే అంజిబాబు తన సోదరిని చూసేందుకు కామవరపు కోట మండలం తాడిచర్లకు ఆదివారం బైక్‌పై బయలుదేరాడు. రోడ్డు మార్గాన ఓవ్యక్తి పడిఉన్నట్టు గుర్తించి సాయం చేసేందుకు బండి దిగి అక్కడకు వెళ్లాడు. ఇదే అదునుగా అక్కడ పడి ఉన్న వ్యక్తి అంజిబాబు జేబులోని సెల్‌ఫోన్ లాక్కుని అతన్ని తోసి బండిపై పరారయ్యాడు. షాక్‌లో ఉన్న అంజిబాబు తేరుకుని ద్వారకా తిరుమల వచ్చి పోలీసులకు పిర్యాదు చేశాడు.

దేవాలయ పరిసరాల్లో గుండె పోటుతో ఒకరి మృతి

ద్వారకా తిరుమల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : తనకుమార్తె ఇంటికి ద్వారకా తిరుమల వచ్చిన వ్యక్తి గుండె పోటుతో మృతి చెందాడు. గుడివాడకు చెందిన ఎం.శ్రీనివాసరావు(65) తన కుమార్తె వద్దకు ద్వారకా తిరుమలకు ఆదివారం వచ్చాడు. దేవాలయంలో అతని అల్లుడు శివ చెవి పోగులు కుడతాడు. మధ్యాహ్నం అల్లుడిని ఇంటికి భోజనానికి పంపి అక్కడ ఆయన ఉన్నాడు. ఆ తరువాత అల్లుడితో ఫోన్‌లో మాట్లాడుతూ కుప్పకూలాడు.. హుటాహుటిన ఘటనా స్థలానికి వచ్చిన అల్లుడు శివ అతన్ని స్థానిక పీహెచ్‌సీకి తరలించగా అతను అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు.

క్లాప్ ఆటోలను కొనసాగించాలి : సోమయ్య

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించే క్లాప్ ఆటోలను కొనసాగించాలని, వాహనాల డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో క్లాప్ ఆటో డ్రైవర్ల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ గత మూడేళ్ల క్రితం నగరంలో చెత్తను సేకరించేందుకు 60 క్లాప్ వాహనాలు ఏర్పాటు చేశారని వీటిలో 60మంది డ్రైవర్లు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రాజు,ఎల్.కృష్ణారావు, జాన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం..



ఒకే వేదికపై చేరిన పూర్వ విద్యార్థులు

కొయ్యలగూడెం మండలంలోని కన్నాపురం జడ్పీ పాఠశాలలో 1986-87లో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా 37 సంవత్సరాల తరువాత కలుసుకుని తమ తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం తాము చదువుకున్న పాఠశాలకు రూ.లక్ష విలువైన యూపీఎస్ అందజేశారు. పూర్వవిద్యార్థులు గొడ్డాటి నాగేశ్వరరావు, గడా రాము, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

- కొయ్యలగూడెం

బాధిత చిన్నారులకు అండగా ఉంటాం : నాయకుల భరోసా

జంగారెడ్డి గూడెం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డి గూడెం ఏరియా ఆసుపత్రిలో చిత్రహింసలకు గురైన బాధిత చిన్నారులకు మేమున్నామంటూ టీడీపీ, జనసేన, వైసీపీ, బీజేపీ నాయకులు భరోసా ఇచ్చారు. ఆదివారం మాజీ డీసీసీబీ ఛైర్మన్ కరాటం రాంబాబు, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జెట్టి గురునాథరావు బాధిత చిన్నారులను పరామర్శించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ, నాయకులు పరిమి సత్తిపండు, కొండ్రెడ్డి కిషోర్, రాష్ట్ర క్షత్రియ, శెట్టిబలిజ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు నంబూరి రామచంద్రరాజు,చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, పెనుమర్తి రామకుమార్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, గుమ్మడి ప్రసాద్, ఈడా శ్రీనివాస్, రాజీ, గణేష్ బాధిత చిన్నారులను పరామర్శించారు. పిల్లలను ప్రభుత్వ సంరక్షణలో ఉంచాలని వారి చదువుకు అయ్యే ఖర్చంతా తామే భరిస్తామని పరిమి సత్తిపండు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ తరఫున పరిమి సత్తిపండు రూ.5 వేలు, కొయ్యలగూడెం మండలం రామానుజపురం గ్రామానికి చెందిన వి.రత్నాచారి రూ.5 వేలను సీడీపీవో పి.బ్యూలాకు అందజేశారు. పిల్లల అవసరాలకు వినియోగించాలని, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. పిల్లలను బాధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



నగదు సాయం అందజేస్తున్న నాయకులు



సామూహిక పూజల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఘనంగా పంచమి సామూహిక పూజలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : మాఘమాసంలోని పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని ఆలయాలు విద్యార్థుల అక్షరాభ్యాస కార్యక్రమాలతో సందడిగా మారాయి. బావిశెట్టివారిపేటలోని కనకదుర్గమ్మకు ప్రత్యేక అలంకారం జరిపి భక్తులకు దర్శనమిచ్చారు. పాత శివాలయం ప్రాంగణంలో ఆలయ అర్చకులు విద్యార్థులతో సామూహిక పూజలు జరిపించారు. ఆలయ అర్చకులు యడవల్లి శ్రీహరిశర్మ ఆధ్వర్యంలో కనక దుర్గాంబ విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో చినవాగేశ్వర రావు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

మంచు పరదా...

చలిమంచుకురిసింది తలుపు తీయవా ప్రభు అంటూ తియ్యని గానాన్ని గుర్తు చేసేలా పల్లెలను మంచు కమ్మేసింది. ఈ మంచు తెరల అందాల మాటున చెట్టూ, చేమా తడిసి ముద్దయ్యింది. ఈ మంచు దుప్పటి నుంచి బయటపడటానికి సూర్యుడికి చాలా సమయమే పట్టింది. తెల్లారింది మొదలు జీవన పయనం కోసం రెక్కలు చాచుకుని సాగే బడుగులు ప్రయాసలు పడుతూనే ముందుకు సాగారు. ఇక బైపాస్, జాతీయ రహదారిపై రయ్యిన దూసుకుపోయే వాహనాలు పొగమంచు కారణంగా తగ్గాల్సి వచ్చింది. ప్రమాదాల భయంతో చాలా వాహనాలను తొమ్మిది గంటలైనా రోడ్డు పక్కనే నిలిపి ఉంచారు.

- ఏలూరు రూరల్



చొదిమెళ్ళ రోడ్డు, ఏలూరు బైపాస్‌పై కమ్మేసిన మంచు



చిన్నారులపై చిత్రహింసలు

» తల్లి కళ్లెదుటే బాలుడిని వైర్‌తో బాదిన ప్రియుడు

» పట్టించుకోని తల్లి » బయటకు పరుగు తీసిన బాలుడు

» స్థానికులు గమనించి తల్లి, ఆమె ప్రియుడికి దేహశుద్ధి

» పోలీసులకు ఫిర్యాదు » జంగారెడ్డిగూడెంలో అమానుషం

ఏలూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జంగారె డ్డిగూడెం పట్టణంలో దారుణం చోటు చేసుకుంది. మహిళతో సహజీవనం చేస్తున్న వ్యక్తి ఆమె పిల్లలను వైర్‌తో విచక్షణారహితంగా రక్తం తేలేటట్లు కొట్టాడు. బాలుడు కేకలు వేస్తూ బయటకు పరుగు తీయడంతో స్థానికులు స్పందించి మహిళ, యువకుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడితో పాటు అతడి చెల్లెలి ఒంటిపై గాయాలు స్థానికులను కలచి వేశాయి. పట్టణంలోని సుబ్బంపేటలో శనివారం రాత్రి గానాల శారద (శశి) తొమ్మిదేళ్ల కుమారుడు రాహుల్‌ను ఆమె ప్రియుడు నల్ల వెలుగుల పవన్ విద్యుత్ వైర్‌తో విచక్షణా రహి తంగా కొట్టాడు. బాధ తట్టుకోలేక రాహుల్ బయటకు పరుగులు తీశాడు. రోడ్డుపై ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి వద్దకు వెళ్లి అంకుల్ నన్ను కాపాడు అంటూ భోరున ఏడుస్తూ అడిగాడు. ఆ వెంటనే పవన్, శారద వచ్చి ఇది మా ఇంట్లో గొడవ మీకెందుకు అని ప్రశ్నించి రాహుల్‌ను తీసుకు వెళ్లడానికి ప్రయత్నించారు. గాయాలతో ఉన్న రాహుల్‌ను చూసి ఇంటి చుట్టు పక్కల వారు చలించిపోయారు. పవన్, శారదలపై ఆగ్రహంతో వారిద్దరికీ దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాలుడు రాహుల్, అతడి చెల్లెలు రేణుకను ఆసుపత్రికి తరలించారు. పవన్ అక్కడి నుంచి పరారయ్యాడు.

తల్లి కళ్లెదుటే హింసించినా..

ఆస్పత్రిలో శనివారం రాత్రి బాలలకు వైద్య సేవలందించి ఆదివారం ఉదయం వారిని ప్రశ్నించగా విచారించగా చిత్రహింసలను ఏకరువు పెట్టారు. ప్రతీరోజు రాత్రి ఇంట్లో పవన్ మద్యం సేవిస్తూ తల్లి కళ్లెదుటే రాహుల్, రేణుకను సెల్‌ఫోన్ వైర్‌తో విచక్షణారహితంగా కొట్టేవాడు. కన్నతల్లి ఏమాత్రం పవన్‌ను వారించేదికాదు. కొంతకాలంగా మాట వినడంలేదంటూ పవన్‌తో పాటు శారద కూడా పిల్లలను కొట్టేది. గట్టిగా అరుస్తున్నారని నోట్లో గుడ్డలు కుక్కి కూడా కొట్టేవారు. కొంత కాలం క్రితం రాహుల్ నోటిపై గట్టిగా కొట్టడంతో పళ్లు ఊడిపోయాయి. ఆ బాధలో ఉన్న బాలుడి నోట్లో పచ్చి మిరపకాయ పెట్టి రాక్షసానందం పొందారు. బాలిక రేణుకను 20 రోజుల క్రితం సెల్‌ఫోన్ చార్జర్ వైర్‌తో పవన్ గట్టిగా కొట్టడంతో ఎడమ కంటిపై తీవ్రగాయ మైంది. బాలిక ఒళ్లంతా మానిన గాయాల మచ్చ లతో నిండిపోయింది. శారద, పవన్ పిల్లలిద్దరినీ క్రూరంగా చిత్రహింసలు పెట్టారు. గాయాలకు చికిత్స చేశామని ఆసుపత్రి సూపరింటెంటెంట్ డాక్టర్ బేబీకమల తెలిపారు.

కలెక్టర్ సీరియస్

చిన్న పిల్లలను క్రూరంగా హింసించడంపై కలెక్టర్ వెట్రిసెల్వి సీరియస్ అయ్యారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెంటెంట్ డాక్టర్ బేబీకమల, ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలాతో ఫోన్‌లో మాట్లాడి పిల్లల పరిస్థితిని అడిగి తెలుసుకు న్నారు. పిల్లలకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఆసుపత్రి వైద్యులు, ఐసీడీఎస్ అధికారుల సంరక్షణలో చిన్నారులను ఉంచాలని ఆదేశించారు. బాధిత చిన్నారులను డీసీహెచ్‌ఎస్, ఐసీడీఎస్ పీడీ, శిశు సంరక్షణ అధికారులు, డీఎస్పీ, సీఐ పరామర్శించారు.

భర్తతో విడిపోయి..

కామవరపుకోట మండలం తాడిచర్లకు చెందిన గానాల శారద (శశి)కు తాడేపల్లిగూడెం వద్ద ఉన్న కూనవరం గ్రామానికి చెందిన గానాల గణేశ్‌తో పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఉదయ రాహుల్, జశిత రేణుక ఇద్దరు పిల్లలు. కొంతకాలం తర్వాత గణేశ్ మద్యానికి బానిసై భార్యా పిల్లలను పట్టించుకోకపోవడంతో శారద భర్తను విడిచిపెట్టి పిల్లలతో తాడిచర్లలో తల్లి వద్ద ఉంటుంది. అదే గ్రామంలో గ్రామ వలంటీరుగా పనిచేసే నల్లవెలుగుల పవన్‌తో శారదకు పరిచయం ఏర్పడింది. దాదాపు ఐదేళ్ల నుంచి వారు సహజీవనం చేస్తున్నారు. శారద తమ్ముడికి పెళ్లి అయ్యే వరకు కొంతకాలం బయట ఉండాలని తల్లిదండ్రులు చెప్పారు. దీనితో శారద పిల్లలను తీసుకుని జంగారెడ్డిగూడెం సుబ్బం పేటలోని నేతాజీ నగర్‌లో అద్దె ఇంట్లో ఉం టోంది. ఆమె ప్రియుడు పవన్ కూడా వాళ్లతోనే ఉంటున్నాడు. పవన్, శారద ఇద్దరూ వేర్వేరు హోటళ్లలో పనిచేస్తున్నారు.

కాగా ఈ సంఘటనపై బాలుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని డీఎస్పీ యు. రవిచంద్ర తెలిపారు. నిందితుడిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

ఆయుష్‌లో అక్రమాలు

● నకిలీ ధ్రువీకరణ పత్రాలతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి

● 650 రోజులుగా మరో ఉద్యోగి గైర్హాజరు ● ఉన్నతాధికారులకు నివేదిక



ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన వైద్య విధానాలను ప్రోత్సహించే ఆయుష్ శాఖలో అక్రమాల పర్వం కొనసాగుతోంది. ఒక ఉద్యోగి నకిలీ ధ్రువీకరణ పత్రాలతో విధులు నిర్వహిస్తున్నాడు. మరొకరు ఏడాదిన్నరకు పైగా విధులకు హాజరకు కావడం లేదు. వారి ఆగడాలపై ఆయుష్‌శాఖ కమిషనర్, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ విచారించి కలెక్టర్‌కు నివేదించారు. ఒకరు నకిలీ ధ్రువీకరణ పత్రాలతో విధులు నిర్వ హించడం, మరో ఉద్యోగి 650 రోజులకుపైగా విధులకు గైర్హాజరవుతున్నట్లు రుజువైంది. ఉన్న తాధికారులు తదుపరి చర్యలకు సమాయత్తమ వుతున్న దశలో అక్రమాలపై ఫిర్యాదు చేసిన అదేశాఖలో దివ్యాంగుడైన చిరుద్యోగిపై బెదిరిం పులు మొదలయ్యాయి.

ఆయుష్ శాఖ జోన్-2 పరిధిలోని ఏలూరు ప్రాంతీయ ఉపసంచాలకుని (ఆర్డీడీ) అజమాయిషీలో ఆయుర్వేదం, హోమియోపతి వైద్య సేవల నిమిత్తం జిల్లావ్యాప్తంగా వైద్యశాలలను నిర్వహిస్తున్నారు. ఏలూరు ఆర్డీడీ కార్యాలయంలో ఒక్క వ్యక్తి కారుణ్య నియామకంపై ఉద్యోగం పొందాడు. విధులు చేపట్టిన నాటి నుంచి దుష్ప్రవర్తన, లంచగొండితనం షరా మామూలే అన్నట్టుగా కొనసాగుతున్నాడు. పదోన్నతికోసం అవసరమైన విద్యార్హత పొందడానికి కూడా అడ్డదారులనే ఎంచుకు న్నాడు. తాడేపల్లిగూ డెంలో ఓ ప్రైవేటు విద్యాసంస్థలో అడ్మిషన్ పొందిన ఇతను ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకున్నాడు. ఆయా తేదీల్లో కార్యాలయ విధులకు సెలవు పెట్టాల్సి ఉంది. దీనికిభిన్నంగా పరీక్షలు జరిగిన తేదీల్లో విధుల కు హాజరైనట్టు ఉద్యోగి సంతకాలు పెట్టడం, మరోవైపు సంబంధిత విద్యార్హత సాధించినట్టు సర్టిఫికెట్లు అందజేసి పదోన్నతి పొందడం గమనార్హం. ఆరోపణలు ఎదుర్కొంటు న్న ఉద్యోగి అసలు పరీక్షలనే రాయలేదని సమా చారం. ఈ విషయం వెలుగులోకి రావడంతో కార్యాలయ హాజరుపట్టీలో సంబంధిత పరీక్షలు జరిగిన రోజుల్లో విధులకు క్యాజువల్ లీవ్ పెట్టి నట్టు దిద్దివేతలు, కొట్టివేతలున్నట్టు ఉన్నతాధి కారుల పరిశీలనలో తేలింది.

ఆర్డీడీ ఆఫీసులో తిష్టవేసిన ఈ ఉద్యోగి కారుణ్య నియామకాలు, మెడికల్ రీయింబర్స్ మెంట్ బిల్లుల క్లియరెన్స్ తదితర పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారి నుంచి పెద్దమొత్తాల్లో లంచాలు తీసుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి.

విధులకు గైర్హాజరు

దర్మాజీగూడెంలో పనిచేస్తున్న మరో ఉద్యోగి పని సర్దుబాటు(వర్క్ అడ్జస్ట్‌మెంట్)పై ఇక్కడ పనిచేస్తున్నారు. రోజువారీ విధులకు హాజరవుతున్నట్టు నమోదుచేయాల్సిన ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరుగాని, అటెండెన్స్ బుక్‌లోగాని సంతకం చేయకుండానే జీతాలు చెల్లిస్తున్నట్టు రుజువైంది. ఉద్యోగి గైర్హాజరుపై స్థానిక ఆయుర్వేద వైద్యశాల వైద్యుడు ఏలూరులోని ఆర్డీడీ కార్యాలయానికి సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేస్తున్నప్పటికీ జీతభత్యాల చెల్లింపులు జరగడం గమనార్హం. విధినిర్వహణలో అక్రమాలకు పాల్పడుతున్న ఈ ఇద్దరు ఉద్యోగుల నిర్వాకంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేయడం, విచారణలో వాస్తవాలు బహిర్గతం కావడంతో ఇపుడు ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలంటూ తోటి ఉద్యోగిపై బెదిరింపులకు దిగడం ఆయుష్‌శాఖ ఏలూరు ఆర్డీడీ కార్యాలయంలో చర్చనీయాంశమైంది. దివ్యాంగుడైన ఫిర్యాదుదారు మరో ఏడాదిలో ఉద్యోగవిరమణ చేయనుండగా, ఫిర్యాదును ఉపసంహరించుకోకపోతే రిటైర్మెంట్ ఆర్థిక ప్రయోజనలేవీ ప్రభుత్వం నుంచి అందకుండా చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నట్టు తెలిసింది.

కమిషనర్‌కు నివేదిక పంపించా

డాక్టర్ కల్పనా కటాక్షం,
ఇన్‌చార్జి ఆర్డీడీ

ఇద్దరు ఉద్యోగుల పనితీరుపై ఫిర్యాదువచ్చిన విషయం వాస్తవమే. సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగికి జనవరి జీతభత్యాల చెల్లింపు నిలిపివేశాం. విద్యార్హతలు, హాజరుపట్టీలో దిద్దివేతలు, తదితర ఆరోపణలు వచ్చిన మరో ఉద్యోగిపై విచారణచేసిన నివేదికను ఆయుష్‌శాఖ కమిషనర్‌కు పంపించాను. కమిషనర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం విచారణ నివేదికలోని

ఆదివారం మధ్యాహ్న భోజనం ప్రారంభం

ముదినేపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూళ్లలో టెన్త్ విద్యార్థులకు ఆదివారం కూడా భోజన సదుపాయం కల్పించే కార్యక్రమం ప్రారంభమయింది. ఈ నెల 2 నుంచి మార్చి పదవ తేదీ వరకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రతి ఆదివారం టెన్త్ తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయనున్నారు. పదవ తరగతి పరీక్షల్లో ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెంచే ప్రక్రియలో భాగంగా టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించి ఆదివారం కూడా మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్న ఆదేశాలను అమలు చేయటం ప్రారంభించారు. ఇందులో భాగంగా ముదినేపల్లి మండలంలోని ముదినేపల్లి, పెదపాలపర్రు, గురజ, పెద గొన్నూరు, వడాలి, బొమ్మినంపాడు, అల్లూరు, చిగురుకోట జిల్లా పరిషత్ హైస్కూళ్లలో తొలి ఆదివారం సుమారు 400 మంది విద్యార్థులు భోజనాలకు హాజరయ్యారు. సోమవారం అమలు చేసే మెనూను ఆదివారం అమలు చేస్తున్నారు.



నూజివీడులో ఆర్‌అండ్‌బీ స్థలాలను ఆక్రమించి నిర్మించిన షెడ్లు

రసీదులు లేకుండా చందాల వసూళ్లు!

నూజివీడు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి శోభనాచలస్వామి దేవస్థానంలో రథసప్తమి ఉత్సవాల పేరుతో కొందరు రసీదులు లేకుండా ఆగిరిపల్లిలోని దుకాణాలు, వ్యక్తుల నుంచి చందాలు వసూలు చేసి రసీదులు ఇవ్వడం లేదు. అనేక సంవత్సరాలుగా ఇలాగే రసీదులు లేకుండా చందాలు వసూలు చేసిన విషయంపై రెండేళ్ళ క్రితం ఆగిరిపల్లిలో పంచాయితీ జరగడంతో నాటి ఎమ్మెల్యే మేకా అప్పారావు రసీదులు లేకుండా చందాలు వసూలు చేయవద్దని స్పష్టం చేసి ఒక కమిటీని వేశారు. సదరు కమిటీ రెండేళ్ళపాటు రసీదులతో చందాలు వసూలు చేసి ఉత్సవాలు నిర్వహించి, రూ.5 లక్షల మిగులు సొమ్మును స్వామివారి పేరిట బ్యాంకులో వేశారు. అంతకుముందు రసీదులు లేకుండా సొమ్ము వసూలు చేసిన వ్యక్తులు ఉత్సవాల అనంతరం మిగిలిన డబ్బును ప్రైవేట్ వ్యక్తులకు వడ్డీకి ఇచ్చామని గ్రామస్తులకు చెప్పారు. ఇప్పటివరకు సదరు వ్యక్తికి ఇచ్చిన సొమ్ము ఇంతవరకు దేవస్థానంకు చెల్లించలేదు. ఇప్పుడు పాతవ్యక్తులు మళ్లీ రెండు రోజుల నుంచి రశీదులు లేకుండా చందాలు వసూలుపర్వంకు తెరలేపారు.

వసూళ్లకు అనుమతి లేదు : ఈవో

ఆగిరిపల్లి రథోత్సవం సంబరాలకు ప్రజల నుంచి చందాలు వసూలు చేయటానికి ఎవరికి అనుమతులు ఇవ్వలేదని, ఆగిరిపల్లి ఆలయ ఈవో సాయి ఆదివారం ఆంధ్రజ్యోతికి తెలిపారు. చందాలు వసూలు చేస్తున్న విషయం తనకు తెలియదన్నారు. చందాలు వసూలుకు దేవస్థానం తరఫున ఎలాంటి రశీదు పుస్తకాలు ఎవరికి ఇవ్వలేదన్నారు.



పక్షుల నమూనాలను తిలకిస్తున్న విద్యార్థులు

చిత్తడి నేలలను పరిరక్షించాలి

కైకలూరు/ముసునూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు చిత్తడి నేలలు అవసరమని ఏలూరు డివిజనల్ ఫారెస్ట్ అధికారి బి. విజయ అన్నారు. ఆదివారం చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా ఆటపాక పక్షుల కేంద్రాన్ని పలువురు విద్యార్థులు సందర్శించారు. ముసునూరు మండలం చెక్కపల్లి జడ్పీ హైస్కూల్ ఎకో క్లబ్ విద్యార్థులు సందర్శించి చిత్తడినేలల విశిష్టతను తెలుసుకున్నారు. ఆటపాక పక్షుల కేంద్రంలోని విద్యాకేంద్రంలో పక్షుల నమూనాలను తిలకించారు. అటవీశాఖ అధికారులు చిత్తడి నేలల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఎన్నో జీవరాశులకు చిత్తడినేలల ఆవాసంగా ఉంటూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతున్నాయన్నారు. రేంజర్ రామలింగాచార్యులు, డిప్యూటీ రేంజర్ రంజిత్ కుమార్, నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా సమన్వయకర్త ఎస్. వెంకటేశ్వర రావు, హెచ్‌ఎం అబ్బాస్, ఉపాధ్యాయులు పద్మకిషోర్, పద్మలత, యోగిత, వింధ్య, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి మహర్దశ



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చాట్రాయి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్దపీట వేయడంతో సాగుకు మహర్దశ వస్తుందని బీజేపీ మండల నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు, ఆదిమూలం నాగమోహనశర్మ, బజ్జూరి గోపి, హేమంత్ హర్షం వ్యక్తం చేశారు. చనుబండలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ నరేంద్ర మోదీ పాలనలో అన్నదాతలకు మేలు జరిగి మళ్ళీ వ్యవసాయానికి పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏపీ అభివృద్ధికి ఊతం

కేంద్ర బడ్జెట్‌లో భారీ కేటాయింపుల వల్ల ఏపీ అభివృద్ధికి ఊతం వస్తుందని ఏలూరు జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 5 ఏళ్ళ వైసీపీ పాలనలో మూలనపడిన పోలవరం ప్రాజెక్టుకు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నిధుల కేటాయింపు ప్రశంసనీయమన్నారు.

మోదీ చిత్తశుద్ధికి తార్కాణం: కోటప్రోలు

ముదినేపల్లి: రాష్ట్ర అభివృద్ధికి, వివిధ వర్గాలకు ప్రయోజనం చేకూరేలా కేంద్రం బడ్జెట్‌లో నిధులు కేటాయించటం హర్షణీయమని బీజేపీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల వాగ్దానాల అమలులో ప్రధాని చిత్తశుద్ధి చూపించారన్నారు.

నామమాత్రంగానే నిధులు : హరనాథ్

మళ్ళీ కూటమిని గెలిపించుకోవాలనే బడ్జెట్‌లో బిహార్‌కు భారీగా నిధులు కేటాయించి, ఏపీని చిన్నచూపు చూశారని లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరనాథ్ విమర్శించారు.



ఏబీ వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ముద్దరబోయిన

ఏబీ వెంకటేశ్వరరావుకు ముద్దరబోయిన అభినందన

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావును తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏబీ వెంకటేశ్వరరావును ముద్దరబోయిన సత్కరించి అభినందనలు తెలిపారు.



మంచినీటి చెరువుకు వెళ్లే పంటబోదెలో గుర్రపుడెక్క తొలగిస్తున్న దృశ్యం

కాల్వలకు నీటి విడుదల

కైకలూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మంచినీటి చెరువులు నింపేందుకు అధికారులు కాలువలకు నీరు విడుదల చేశారు. కైకలూరు పంచాయతీ మంచినీటి చెరువుకు మోటార్లు ద్వారా నీటిని తోడుతున్నారు. అలాగే మంచినీటి చెరువులకు వెళ్లే పంట బోదెల్లో చెత్తాచెదారం, గుర్రపుడెక్క, తూడు, నాచు ఉపాధి కూలీలతో తొలగించారు. వరహాపట్నంలోని పంట కాలువలో గుర్రపుడెక్కను ఎక్స్‌కవేటర్ల ద్వారా తొలగిస్తున్నారు.

వైద్య శిబిరం విజయవంతం

కలిదిండి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో గుండె వైద్య నిపుణులు బత్తిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 700 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మానసిక వైద్యులు రమణారావు, సుభాష్, ఆర్థోపెడిక్ వైద్యులు నరేష్, వేణు గోపాలరాజు, గైనకాలజిస్ట్ లక్ష్మి, త్రివేణి, గ్యాస్ట్రో సర్జన్ నీలాద్రి రాజు, నరాల వైద్యులు కిరణ్, కేన్సర్ వైద్య నిపుణులు సుధీర్ వర్మ, కిడ్నీ వైద్యులు అశోక్ వర్మ వైద్య సేవలందించారు.

ఆక్రమణలు పట్టించుకోరేం?

» రహదారిని ఆక్రమించి యథేచ్ఛగా వ్యాపారాలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మున్సిపల్ పరిధిలో పలు ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణ పాలవుతున్నాయి. నూజివీడు పట్టణంలో ప్రధాన డ్రెయిన్‌లను దాటి యథేచ్ఛగా పక్కాగా షెడ్లు నిర్మించి పలువురు వ్యాపారాలు నిర్వహిస్తున్నా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. తాజాగా నూజివీడు -పోతురెడ్డిపల్లి అడ్డరోడ్డు వద్ద మున్సిపల్ డ్రెయిన్ దాటి ఆర్‌అండ్‌బీ స్థలంలో షెడ్డువేసి వ్యాపారాలు చేస్తున్న సంఘటనలతో పాటు ప్రధాన కూడళ్లల్లో ఏకంగా ఆర్‌అండ్‌బీ స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అసలే ఇరుకు రోడ్లతో ఇబ్బందులు పడుతుంటే రహదారుల మార్జిన్‌లు సైతం ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపట్టడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా ఆక్రమణలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వ్యాక్సిన్ వేయించేందుకు కుక్కల తరలింపు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అక్షరం అండగా సమస్య పరిష్కారం అజెండాగా నూజివీడులో నిర్వహించిన సదస్సులో సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికారులు వరుసగా చర్యలు చేపడుతున్నారు. పట్టణంలో కోతులు, కుక్కలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అధికారుల దృష్టికి స్థానికులు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకురాలు శివరాజువసుంధరాదేవి, ఎంప్లాయిస్ కాలనీకి చెందిన సతీష్‌లు కోతులు, కుక్కల బెడదను పేర్కొంటూ ప్రతిరోజూ ఇద్దరు, ముగ్గురు కుక్కలు, కోతుల దాడులకు తీవ్ర గాయాలపాలవుతున్నారంటూ సదస్సులో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మున్సిపల్ అధికారులు చర్యలకు పూనుకుని ఆదివారం కుక్కల నియంత్రణకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేసేందుకు ప్రత్యేకంగా కుక్కలను వాహనాల్లో తరలించారు. వ్యాక్సిన్ కార్యక్రమం పూర్తి అయిన అనంతరం కుక్కలను యథాస్థానాల్లో వదిలివేస్తామని, ఫలితంగా కుక్కల సంతతిని నియంత్రించవచ్చని మున్సిపల్ ఎస్సై నాగరాజు తెలిపారు.



పోతనపల్లిలో క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న లంబాడా సంఘీయులు

లంబాడా సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

చాట్రాయి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): లంబాడాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఏపీ గిరిజన సంక్షేమ సంఘం, జంజారా భజరంగి భేరి లంబాడా సంఘం ప్రచురించిన 2025 క్యాలెండర్‌ను శనివారం రాత్రి పోతనపల్లి తండాలో స్థానిక నాయకులు ఆవిష్కరించారు. సేవాలాల్ జయంతినాడు రాష్ట్రం సెలవు ప్రకటించాలని, 500 జనాభా కలిగిన తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

నేడు అక్షరాభ్యాసాలకు ఏర్పాట్లు



మండవల్లిగా సరస్వతీదేవిగా దుర్గమ్మ

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమిని పురస్కరించుకుని నూజివీడు సరస్వతీదేవి ఆలయంలో అక్షరాభ్యాస కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. వసంత పంచమి మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని ఆంధ్రా బాసరగా పేరుగాంచిన సరస్వతిదేవి ఆలయంలో అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని, తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలతో పాటు ఖమ్మం జిల్లా నుంచి భక్తులు తరలి వచ్చి చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించటం ఇక్కడ ఆనవాయితీ.

మండవల్లి: మండలంలోని పలు ఆలయాల్లో వసంత పంచమి సందర్భంగా ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. మండ వల్లిలోని విజయదుర్గ అమ్మవారి ఆలయంలో శ్యామల నవరాత్రులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా అమ్మవారి శ్రీ సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వసంత పంచమి సందర్భంగా పండితులు చాగంటి శ్రీనివాస్ అమ్మవారికి సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

కలిదిండి: కొండంగిలో పెద్దింటమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భజనలు నిర్వహించారు. కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, పోసిన వీరేశు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శోభనాచలేశ్వరుడి కల్యాణం



శాంతి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు గజ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం ఉదయం రజక సంఘం ఆధ్వర్యంలో శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. రాత్రి స్వామిని పెండ్లి కుమారుడిగా అలంకరించి గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చి మడుపల్లి లక్ష్మినరసింహమూర్తి, మానేపల్లి జగదీశ్వరరావు, తవ్వ మురళీధర్ , జూలూరు చంద్రమౌళీశ్వరరావు, కల్లూరు ముక్తేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు.

క్రైమ్ కార్నర్

కళ్ళల్లో కారంకొట్టి దాడి

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తమ భూమిని కబ్జా చేయడాన్ని ప్రశ్నిం చారని కళ్ళల్లో కారంకొట్టి దాడిచేసిన ఉదంత మిది. బాధితుల వివరాల ప్రకారం నూజివీడు మండలం అన్నవరానికి చెందిన ప్రత్తిపాటి నాగరాజు, నాగలక్ష్మికి గ్రామంలోని ఆర్.ఎస్ నెంబర్ 197-1లో 56 సెంట్లు భూమి ఉంది. అయితే సదరు భూమిని దువ్వూరి వెంకటేశ్వర రావు అనే వ్యక్తి ఆక్రమించడంతో అదేమని ప్రశ్నించినందుకు వెంకటేశ్వరరావు కుటుంబీకులు కళ్ళల్లో కారం చల్లి కర్రలతో దాడి చేశారు. దీంతో నాగరాణి, నాగరాజు నూజివీడు ఏరియాఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నూజివీడు రూరల్ పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని అదృశ్యం

ముదినేపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తల్లితో కలసి తాత ఇంటికి వచ్చిన ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం కైకలూరుకు చెందిన విద్యార్థిని తన తల్లితో కలసి గత నెల 31న ముదినేపల్లి మండలం వడాలిలోని తాత గారింటికి వచ్చింది. శనివారం ఉదయం వడాలి నుంచి గుడివాడలో కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. విద్యార్థిని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్‌ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమించాలని వేధింపులు

ముదినేపల్లి: ప్రేమించాలని వేధిస్తున్న యువకుడి బారి నుంచి తన కుమార్తెకు రక్షణ కల్పించాలని కోరుతూ గురజ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్‌ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్సైజ్ దాడి.. ఒకరి అరెస్టు

ముసునూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయాలు సాగిస్తున్న వ్యక్తిపై ఎక్సైజ్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కేవీఎన్ నాగ ప్రభు కుమార్ ఆధ్వర్యంలో ముసునూరులో జరిగిన దాడుల్లో వీరంకి నాగరాజును అదుపులోకి తీసుకుని, 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జూదరుల అరెస్ట్

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న ఆగిరిపల్లిలో పేకాట శిబిరంపై పోలీసులు మెరుపు దాడి చేసి 8 మంది నిందితులను పట్టుకున్నారు. వీరి నుంచి రూ.5,300 నగదు, ఆరు బైకులు స్వాధీనపరుచుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శుభశేఖర్ తెలిపారు.